విశాఖపట్టణం
ఆదివారం 27 సెప్టెంబర్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 226 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి



మోదీకి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్‌సింగ్ విగ్రహం ఏర్పాటు

2

# భారీ వర్షాలతో ఉత్తరాంధ్ర అతలాకుతలం

అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు

భారీ వర్షాలు, వరద పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్ష

వేటకు వెళ్లలేని మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం పంపిణీకి ఆదేశం

ప్రకాశం బ్యారేజీకి ఎగువ, దిగువన కొత్త బ్యారేజీల నిర్మాణ ప్రతిపాదనలు

తాజా వర్షాలతో రాష్ట్రంలోని జలాశయాల్లోకి 21 టీఎంసీల అదనపు నీరు

రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గుదల



**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

గత కొద్దిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షాలు, వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, వేటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార కుటుంబాలకు తక్షణ సాయంగా 50 కేజీల బియ్యం అందించాలని ఆదేశించారు. అదే సమయంలో కృష్ణా నదిపై రెండు కొత్త బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను వేగవంతం చేయాలని అధికారులకు కీలక సూచనలు చేశారు.

శనివారం జరిగిన ఈ సమీక్షలో అధికారులు రాష్ట్రంలోని తాజా పరిస్థితిని సీఎంకు వివరించారు. ఉత్తరాంధ్రలో నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, పలుచోట్ల నివాస ప్రాంతాలు, పంట పొలాలు నీట మునిగాయని తెలిపారు. సహాయక చర్యలపై ఆరా తీసిన ముఖ్యమంత్రి, ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని స్పష్టం చేశారు. ఐదు రోజులుగా సముద్రంలోకి వెళ్లలేని మత్స్యకారుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వారికి అండగా నిలవాలని, తక్షణమే బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు.

**కృష్ణాపై కొత్త బ్యారేజీలు.. నీటి భద్రతపై దృష్టి**

ఈ సందర్భంగా స్థానికంగా కురుస్తున్న వర్షాల ..మిగతా 2లో



## విజయవాడలో పేదలకు పట్టాభిషేకం

ఈ నెల 30న చంద్రబాబు చేతుల మీదుగా పట్టాలు

ఈ నెల 30న విజయవాడలో ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీ

24,057 కుటుంబాలకు సంపూర్ణ యాజమాన్య హక్కులు

రూ.9800 కోట్ల విలువైన భూములపై పేదలకు అధికారం

దశాబ్దాల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన కూటమి ప్రభుత్వం

8 నియోజకవర్గాల్లోని లబ్దిదారులకు ప్రయోజనం

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

పేదలకు పూర్తిస్థాయి యాజమాన్య హక్కులు కల్పించే బృహత్తర కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా నగరవాసులను వేధిస్తున్న ఇళ్ల పట్టాల సమస్యకు ..మిగతా 2లో

# ముగిసిన నైరుతి రుతుపవనాల సీజన్

లోటు వానలతో సమాప్తం

చివరలో కొంతమేర ఆదుకున్న వాయుగుండం

నేటి నుండి అక్టోబర్ రెండు వరకు మళ్ళీ వేడి గాలులు

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

తెలంగాణలో నైరుతి రుతుపవనాల సీజన్ ముగిసింది. ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు నిరాశే మిగిల్చినా, బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం చివరి రోజుల్లో ఆదుకుంది. గత నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురిసిన విస్తారమైన వర్షాల కారణంగా వర్షపాతం లోటు గణనీయంగా తగ్గింది. సీజన్ మొత్తం మీ ద 20 శాతంగా ఉన్న లోటు, ఈ వర్షాలతో 15 శాతానికి పరిమితమైంది.ప్టెంబర్ 22వ తేదీ వరకు రాష్ట్రంలో 34 శాతం లోటు వర్షపాతం నమోదైంది. అయితే గత నాలుగు రోజుల్లో కురిసిన భారీ వర్షాలతో ఈ నెల లోటు కేవలం 4 శాతానికి పడిపోయింది. ఈ కొద్దిరోజుల్లోనే సగటున 52 మిల్లీమీ టర్ల వర్షపాతం నమోదుకావడం ..మిగతా 2లో



## యూట్యూబర్ రావణ్‌కు విదేశీ నిధులు!

మావోయిస్టు భావజాలాన్ని ప్రచారం చేసేందుకే విదేశీ నిధులు : పోలీసుల అనుమానం

ఏడు రోజుల పోలీసు కస్టడీలో పలు అంశాలు వెల్లడి



**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

యూట్యూబర్ ప్రశ్న రావణ్ (బచ్చలకూరి జోసెఫ్)కు విదేశాల నుంచి భారీగా నిధులు సమకూరినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సైతం పర్యటించారని, వారి భావజాలాన్ని వ్యాప్తి చేయడానికి పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు పోలీసులు భావిస్తున్నారు. కృష్ణా జిల్లా గన్నవరం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు ఆధారంగా పోలీసులు రావణ్‌ను 7 రోజుల ..మిగతా 2లో



## ఏటీఎంలలో దుర్గమ్మ ప్రసాదం

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

రాష్ట్రంలో మొదటిసారిగా దుర్గమ్మ దేవస్థానంలో ప్రసాదం ఏటీఎంను ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. భక్తులు ప్రసాదం కౌంటర్ల వద్ద గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే శ్రమ లేకుండా లడ్డూ ప్రసాదాన్ని పొందేందుకు ఈ ఆధునిక సాంకేతికత ఎంతో దోహదపడుతుందన్నారు దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్ర ద్వారా డిజిటల్ చెల్లింపులు జరిపి క్షణాల్లో ప్రసాదం పొందేలా రూపొందించారు. ప్రస్తుతం ట్రయల్ రన్ గా ఏర్పాటు చేశామని,పనితీరు పరిశీలించిన తర్వాత భక్తుల రద్దీ అధికంగా ఉండే ఇతర ప్రాంతాల్లోనూ మరిన్ని యంత్రాలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తాం అన్నారు. ఉత్సవాల రద్దీ సమయంలోనే కాదు సాధారణ రోజుల్లోనూ సులువుగా లడ్డూ ప్రసాదం పొందొచ్చన్నారు. మరోవైపు ఫేక పూజా టికెట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు దేవాదాయశాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్. దేవాలయ ..మిగతా 2లో

## సర్' నోటీసులపై ఈసీ కీలక ప్రకటన

వ్యక్తిగత హాజరు అవసరం లేదు!

సర్ నోటీసులపై ఈసీ కీలక ప్రకటన

అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత హాజరు అవసరం లేదు

కొత్త ఓటర్లు నిరంతర నమోదు ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు

20 రాష్ట్రాల్లో ఇప్పటికే ఓటరు జాబితా సవరణ పూర్తి

ఫారం-6 డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందని వెల్లడి




**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక ఊరటనిచ్చింది. ఓటర్లు వ్యక్తిగత విచారణకు హాజరు కావాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. బీఎల్వోలే ఓటర్ల ఇంటికి వచ్చి అవసరమైన డాక్యుమెంట్లను తీసుకుంటారని వివరించింది. ఈ మేరకు శనివారం ఢిల్లీలో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు .మిగతా 2లో

## పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి

11 మంది మృతి

పాకిస్థాన్‌లో పోలీసు చెక్‌పోస్ట్‌పై ఆత్మాహుతి దాడి

ఈ ఘటనలో 11 మంది మృతి, 30 మందికి గాయాలు

పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వెల్లడి

దాడికి బాధ్యత ప్రకటించుకున్న తెహ్రీక్-ఇ-తాలిబన్

2



# భారీ వర్షాలతో ఉత్తరాంధ్ర అతలాకుతలం





**మొదటి పేజీ తరువాయి...**

వల్ల ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పెరుగుతోందని అధికారులు తెలపగా, ఆ నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునే మార్గాలపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పులిచింతల-ప్రకాశం బ్యారేజీ మధ్య ఒకటి, ప్రకాశం బ్యారేజీకి దిగువన మరొకటి చొప్పున రెండు కొత్త బ్యారేజీల నిర్మాణం అవసరమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి గతంలో రూపొందించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు.

అలాగే, హిర మండలం లిఫ్ట్ ప్రాజెక్టుకు విద్యుత్ సౌకర్యం కల్పించి, వంశధార నీటిని రిజర్వాయర్‌లోకి తరలించే పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులకు సూచించారు.

తాజా వర్షాల వల్ల రాష్ట్రంలోని 29 ప్రధాన రిజర్వాయర్లలోకి భారీగా నీరు వచ్చి చేరినట్లు ఇరిగేషన్ అధికారులు సీఎంకు వివరించారు. సెప్టెంబర్ 23 నాటికి 101 టీఎంసీలుగా ఉన్న నీటి నిల్వ, కేవలం మూడు రోజుల్లో 21 టీఎంసీలు పెరిగి 122 టీఎంసీలకు చేరిందని తెలిపారు. ఒక్క ఉత్తరాంధ్రలోని 11 ప్రాజెక్టుల్లోనే సుమారు 5 టీఎంసీల నీరు అదనంగా చేరిందని వివరించారు. ఈ వర్షాల వల్ల రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గిందని అధికారులు తెలిపారు.

గోదావరిపై ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రవాహం 1.20 లక్షల క్యూసెక్కుల నుంచి 3.50 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. వంశధారపై గొట్టా బ్యారేజీకి, నాగావళిపై నారాయణపురం ఆనకట్టకు కూడా ఇన్‌ఫ్లో రికార్డు స్థాయిలో పెరిగింది. పెరిగిన ప్రవాహాలను సద్వినియోగం చేసుకుని రిజర్వాయర్లతో పాటు చిన్న, మధ్య తరహా నీటి వనరులను కూడా నింపాలని సీఎం ఆదేశించారు. వరద తగ్గుముఖం పట్టినా, ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## సర్' నోటీసులపై
# ఈసీ కీలక ప్రకటన

**మొదటి పేజీ తరువాయి...**

డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషి సమావేశమై పలు అంశాలపై స్పష్టతనిచ్చారు. సవరణ ప్రక్రియలో భాగంగా ఫారం-6కు జతపరిచే డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని ఈ సందర్భంగా ఈసీ గుర్తుచేసింది. బీహార్, పశ్చిమ బెంగాల్‌తో సహా ఇప్పటికే 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తయిందని ఎన్నికల సంఘం వెల్లడించింది. జాబితాలో పేర్లు లేని వారు, యువత, తొలిసారి ఓటు హక్కు పొందిన వారు నిరంతర నమోదు ప్రక్రియ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని సూచించింది. ఇందుకోసం సంబంధిత నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిని (జు-ూా) సంప్రదించాలని, త్వరలో ప్రత్యేక నమోదు కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని పేర్కొంది.ఇటీవల గోవాలో 97 మంది అర్హులైన ఓటర్ల పేర్లు తుది జాబితాలో గల్లంతైన ఉదంతంపై ఈసీ స్పందిస్తూ, బూత్ స్థాయి అధికారులతో ఇంటింటి సర్వే చేయిస్తున్నామని తెలిపింది. గల్లంతైన వారిలో ఇప్పటికే 81 మంది ఫారం-6 ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకున్నారని గోవా సీఈవో వివరించారు.ఎన్నికల కమిషనర్లు క్యాబినెట్ సెక్రటరీకి రాసిన లేఖపై తలెత్తిన ఊహాగానాలపై కూడా ఈసీ స్పష్టత ఇచ్చింది. సదరు లేఖ ఎన్నికల సంఘానికి డిప్యుటేషన్‌పై వచ్చిన ఒక అధికారి పనితీరుకు సంబంధించినదని, అంతే తప్ప ఈసీ లేదా ఐటీ శాఖల విధానపరమైన అంశాలకు దానికి ఎలాంటి సంబంధం లేదని వివరించింది.

## యూట్యూబర్ రావణ్‌కు
# విదేశీ నిధులు !

**మొదటి పేజీ తరువాయి...**

పాటు సుదీర్ఘంగా విచారించారు. ఈ విచారణలో సంచలన విషయాలు వెలుగు చూశాయి.నిందితుడు రావణ్‌కు విదేశాల నుంచి విడతల వారీగా సుమారు రూ.29 లక్షలకు పైగా నిధులు బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పలుమార్లు పర్యటించడంతో పాటు వారి భావజాలాన్ని వ్యాప్తిచేయాలని చూసినట్లు అనుమానిస్తున్నారు. పలు నిషేధిత సంస్థల సానుభూతిపరులతో నిరంతరం కాంటాక్టులో ఉన్నట్లు ఆధారాలు లభించాయి. మావోయిస్టు భావజాలాన్ని వ్యాప్తి చేసేందుకు ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. అయితే ఈ లావాదేవీలపై పోలీసులు ప్రశ్నించినప్పటికీ రావణ్ నోరువిప్పలేదు.వైసీపీ నేత ఇంద్రసేనా నాయుడు ఖాతా నుంచి పలు విడతల్లో దాదాపు రూ.25 లక్షల వరకు రావణ్‌కు చేరినట్లు దర్యాప్తులో గుర్తించారు. నిందితుడు ప్రయాణాలకు విమాన టికెట్లను కూడా ఆయనే బుక్ చేసినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, కీలక రాజకీయ నాయకులే లక్ష్యంగా చేసుకొని దుష్ప్రచారం చేస్తూ వీడియోలు రూపొందించేందుకే ఈ నిధులు సమకూర్చినట్లు పోలీసులు గుర్తించారు. ఇంద్రసేనా నాయుడు ఫ్లాట్ నుంచే ప్రశ్న యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు.నిషేధిత మావోయిస్టు ఉద్యమాన్ని, ఆ పార్టీ అగ్రనేతలను పొగుడుతూ రావణ్ తన ఛానల్‌లో అనేక వీడియోలు రూపొందించాడు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లోని ఏజెన్సీ, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పలుమార్లు పర్యటిస్తూ, అక్కడి సానుభూతిపరులతో తరచూ ఫోన్ కాల్స్ మాట్లాడినట్లు కాల్ డేటా ద్వారా గుర్తించారు. సాయుధ పోరాటానికి మద్దతుగా కంటెంట్ తయారీ, ఎడిటింగ్, ప్రచారంలో రావణ్ కీలక పాత్ర పోషించాడని దర్యాప్తులో వెల్లడైంది. అతడి యూట్యూబ్ ఛానల్ సబ్‌స్క్రైబర్లలో భారీగా ఫేక్ అకౌంట్లు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. విదేశీ నిధులతో పాటు వైసీపీ నేత ఇంద్రసేనా నాయుడు నుంచి నగదు రావణ్‌కు ఎందుకు వచ్చిందనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

## పాకిస్థాన్‌లో
# ఆత్మాహుతి దాడి

**11 మంది మృతి**

**పాకిస్థాన్‌లో పోలీసు చెక్‌పోస్ట్‌పై ఆత్మాహుతి దాడి**

**ఈ ఘటనలో 11 మంది మృతి, 30 మందికి గాయాలు**

**పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వెల్లడి**

**దాడికి బాధ్యత ప్రకటించుకున్న తెహ్రీక్-ఇ-తాలిబన్**

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు మరోసారి మారణహోమం సృష్టించారు. వాయవ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో శనివారం చోటుచేసుకున్న ఆత్మాహుతి దాడిలో కనీసం 11 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలోని ఒక రహదారి పక్కన ఉన్న పోలీసు చెక్‌పోస్ట్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగింది. పేలుడు పదార్థాలతో నింపిన వాహనంతో వచ్చిన ఆత్మాహుతి బాంబర్, చెక్‌పోస్ట్ సమీపంలోకి రాగానే తనను తాను పేల్చుకున్నాడు. ఈ పేలుడు ధాటికి ఆ ప్రాంతం ఒక్కసారిగా దద్దరిల్లింది. ఈ ఘటనలో భారీ స్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది.ఈ ఘాతుకానికి తమదే బాధ్యతని పాకిస్థానీ తాలిబన్‌గా పిలిచే తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ప్రకటించింది. ఇటీవలి కాలంలో పాకిస్థాన్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు గణనీయంగా పెరిగాయి. ప్రధానంగా టీటీపీ, బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) వంటి వేర్పాటువాద సంస్థలు వరుస దాడులకు పాల్పడుతున్నాయి. ఈ తాజా ఘటనతో దేశంలోని భద్రతా వ్యవస్థలోని లోపాలపై మరోసారి తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## ఏటీఎంలలో
# దుర్గమ్మ ప్రసాదం

**మొదటి పేజీ తరువాయి...**

దర్శనాలు, సేవల పేరిట దళారుల ప్రమేయాన్ని ఉపేక్షించేది లేదన్నారు. విజయవాడలో ఇటీవల వెలుగుచూసిన ఫేక పూజా టికెట్ల వ్యవహారంపై దేవస్థానం అధికార యంత్రాంగం తక్షణమే అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేసిందని, బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆలయ సేవలను కేవలం ప్రభుత్వం, దేవస్థానం అధికారికంగా ఏర్పాటు చేసిన వెబ్‌సైట్లు, డిజిటల్ యాప్‌లు , అధీకృత కౌంటర్ల ద్వారా మాత్రమే పొందాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని పారదర్శకంగా సేవా టికెట్లు పొందాలని, దళారులను ప్రోత్సహించవద్దన్నార.ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు దేవాదాయశాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. సామాన్య భక్తునికే అగ్రస్థానం కల్పించే దిశగా ప్రతి విభాగం సమన్వయంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. రద్దీ నియంత్రణ, క్యూలైన్ల నిర్వహణ, తాగునీరు, ప్రసాద వితరణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎండ, వర్షాల బారిన పడకుండా షెడ్ల నిర్మాణం, నిరంతర పర్యవేక్షణకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా దర్శనం చేసుకుని వెళ్లేలా ప్రణాళికలు రూపొందించామని, ఉత్సవాలను విజయవంతం చేసేందుకు భక్తులందరూ అధికార యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.




## మన్మోహన్‌సింగ్‌కు
# భారతరత్న ఇవ్వాలి

**మోదీకి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి**

**హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్‌సింగ్ విగ్రహం ఏర్పాటు**

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విప్రో సర్కిల్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వకపోవటం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. పరిపాలనలో మన్మోహన్‌సింగ్ తీసుకున్న నిర్ణయాలు చాలా గొప్పవన్న సీఎం రేవంత్‌రెడ్డి భారతదేశం గర్వించదగిన జాతిరత్నం డాక్టర్ మన్మోహన్‌సింగ్ అని కొనియాడారు. మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వకపోవటం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లోని విప్రో సర్కిల్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. మన్మోహన్‌సింగ్ స్మారక పార్క్ ఏర్పాటు చేశారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

**వారి పేర్లు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయి**

మన్మోహన్‌సింగ్ జీవితం జెన్‌జీ సహా అన్ని తరాలకు ఒక స్ఫూర్తి అని సీఎం తెలిపారు. మారుమూల గ్రామం నుంచి ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ వరకు మన్మోహన్‌సింగ్ విద్యాభ్యాసం సాగిందని, తన చదువు, విజ్ఞానం అంతా దేశానికే ఉపయోగపడాలని భావించి భారత్‌కు తిరిగివచ్చారని గుర్తు చేశారు. మన్మోహన్‌సింగ్, పీవీ నర్సింహారావు ఆలోచనల ఫలితమే సరళీకృత ఆర్థిక విధానమని, ఆనాడు ఇద్దరూ కలిసి తీసుకున్న నిర్ణయాలే ఇవాళ దేశాన్ని పటిష్ఠంగా నిలబెట్టాయని, ఇలాంటి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లు ఏర్పడ్డాయని కొనియాడారు.

దేశం విషయానికి వస్తే నెహ్రూ- సర్దార్ వల్లాభాయ్ పటేల్ జోడీ శాశ్వతంగా నిలిచిపోతుందని రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ విషయంలో మన్మోహన్‌సింగ్, సోనియాగాంధీ పేర్లు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయని, ఆర్థికంగానే కాదని రాజకీయంగా కూడా దేశం కొన్నాళ్లు సంక్షోభాన్ని ఎదుర్కొన్నదని, దేశం రాజకీయ సంక్షోభంలో ఉన్నప్పుడు మన్మోహన్‌సింగ్ దేశ పగ్గాలు చేపట్టారని వెల్లడించారు.

**ఎకనామిక్ ఫైటర్ మన్మోహన్‌సింగ్**

మన్మోహన్‌సింగ్ సరళీకృత ఆర్థికవిధానాల వల్లే ఇలాంటి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లు ఏర్పడ్డాయన్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ దేశం ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆర్థికమంత్రిగా బాధ్యతలు చేపట్టారని కొనియాడారు. మన్మోహన్‌సింగ్ ఆర్థిక పరిజ్ఞానం తెలిసి పీవీ నర్సింహారావు బాధ్యతలు ఇచ్చారని, మన్మోహన్‌సింగ్‌ను ఎకనమిక్స్ టైమ్స్ ఎకనమిక్ ఫైటర్‌గా వర్ణించిందని గుర్తు చేశారు.

# ముగిసిన నైరుతి రుతుపవనాల సీజన్

**మొదటి పేజీ తరువాయి...**

విశేషం. ఈ వర్షాలకు ముందు 18 జిల్లాల్లో లోటు వర్షపాతం ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 14కు తగ్గింది. అయితే, ఏ జిల్లాలోనూ అధిక వర్షపాతం నమోదు కాలేదు.మరోవైపు, భారీ వర్షాల ప్రభావంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. శుక్రవారం సాయంత్రానికి 20.2 అడుగులకు చేరిన ప్రవాహం, నేడు (శనివారం) నాటికి 30 అడుగులకు చేరుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో భద్రాద్రి జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ అప్రమత్తం చేశారు. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో 15 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. భూపాలపల్లి జిల్లాలో వర్షపు నీరు గనుల్లోకి చేరడంతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది.వాయుగుండం ప్రభావం ముగియడంతో శనివారం నుంచి రాష్ట్రంలో ఉక్కపోతతో కూడిన వాతావరణం ఉంటుందని వాతావరణ నిపుణులు తెలిపారు. రేపటి (ఆదివారం) నుంచి అక్టోబర్ 2 వరకు రాష్ట్రవ్యాప్తంగా వేడి వాతావరణం ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## విజయవాడలో
# పేదలకు పట్టాభిషేకం

**మొదటి పేజీ తరువాయి...**

శాశ్వత పరిష్కారం చూపే దిశగా కీలక ముందడుగు వేసింది. విశాఖపట్నంలో ఇటీవల విజయవంతంగా నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమ స్ఫూర్తితో, ఇప్పుడు విజయవాడలో భారీ ఎత్తున ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీకి సిద్ధమైంది. ఈ నెల 30వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా 24,057 కుటుంబాలకు సంపూర్ణ హక్కులతో కూడిన పట్టాలను అందించనున్నారు. విజయవాడలో ప్రతి ఎన్నికల్లోనూ ప్రధాన అజెండాగా మారుతున్న ఇళ్ల పట్టాల సమస్యకు కూటమి సర్కార్ చరమగీతం పాడుతోంది. దశాబ్దాల క్రితం అందించిన ఎన్టీఆర్ పట్టాలకు చట్టబద్ధత కల్పిస్తూ, వాటిపై లబ్దిదారులకు పూర్తి యాజమాన్య హక్కులను కట్టబెడుతోంది. ఈ కార్యక్రమం ద్వారా సుమారు రూ. 9,800 కోట్ల విలువైన 617 ఎకరాల భూమిపై పేద, మధ్య తరగతి కుటుంబాలకు అధికారం లభించనుంది. దీనివల్ల ఒక్కో కుటుంబానికి సుమారు రూ. 40 లక్షల నుంచి రూ. 45 లక్షల వరకు లబ్ది చేకూరనుంది. ముఖ్యంగా, విజయవాడ నగరంలోని మూడు నియోజకవర్గాల పరిధిలో కొండలపై ఇళ్లు నిర్మించుకున్న వారి చిరకాల స్వప్నం ఈ కార్యక్రమంతో నెరవేరబోతోంది. తమ ఇళ్లకు శాశ్వత భద్రత, భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కొండ ప్రాంత నివాసితులు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు.

ఇటీవల జరిగిన జిల్లా ప్రజాప్రతినిధుల సమావేశంలోనూ ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ప్రతినిధులు ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం వేగంగా స్పందించి, ఇప్పుడు 29.86 లక్షల చదరపు గజాల స్థలంపై లబ్దిదారులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తోంది. క్రమబద్ధీకరణ చేస్తున్న భూముల మార్కెట్ విలువ దాదాపు రూ. 24,297 కోట్లుగా ఉంటుందని అంచనా.

ఈ పట్టాల పంపిణీ ద్వారా ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు, కృష్ణా జిల్లాలోని గన్నవరం సహా మొత్తం 8 నియోజకవర్గాల్లోని 15 మండలాల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. సామాజిక వర్గాల వారీగా చూస్తే బీసీలు 12,093, ఓసీలు 6,130, ఎస్సీలు 4,546, ముస్లిం బీసీలు 955, ఎస్టీలు 333 కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ది పొందనున్నాయి.

**నియోజకవర్గాల వారీగా లబ్దిదారుల సంఖ్య:**

విజయవాడ (తూర్పు) - 7,990
విజయవాడ (పశ్చిమం) - 7,465
విజయవాడ (సెంట్రల్) - 5,815
గన్నవరం - 602
జగ్గయ్యపేట - 1,135
మైలవరం - 981
నందిగామ - 54
తిరువూరు - 15

## నేషనల్ మైనార్టీ కమిషన్ చైర్ పర్సన్‌ను

# కలిసిన క్రైస్తవ సంఘ నాయకులు

**విశాఖపట్నం (జయ జయహే)**

నేషనల్ మైనార్టీ కమిషన్ వైస్ చైర్ పర్సన్ మునావరి బేగం ను ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు బొల్లవరపు జాన్ వెస్లీ మరియు ఉపాధ్యక్షుడు జి విక్టర్ పాల్ కలసి ఆంధ్రప్రదేశ్ లో ఈ కూటమి ప్రభుత్వం లో క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలు మరియు క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు సంబంధించి అనేక విషయాలు చర్చించడం జరిగింది. ముఖ్యంగా క్రైస్తవ మైనార్టీల యొక్క ఆందోళనలను అంటే పాస్టర్లు మరియు సంఘాలపై జరుగుతున్న దాడులు మరియు ఫిర్యాదులపై పోలీసులు స్పందన సరిగా లేకపోవడం మరియు దళిత క్రైస్తవులను షెడ్యూల్డ్ కుల హోదా నుండి నిరంతరం మినహాయించడం వంటి విషయాలను చర్చించడం జరిగింది. మైనార్టీల హక్కులు మరియు రక్షణ ఏ విధంగా ఉల్లంఘనలకు గురికాబడుతున్నాయో మరియు మైనార్టీలు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించడానికి ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడానికి జాతీయ మైనార్టీ కమిషన్ కు అధికారం ఉంది కాబట్టి ఈ ఆందోళనను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కమిషన్ ను కోరడం జరిగింది.. ఈ సంఘటనలో నిష్పక్షపాతంగా విచారణ జరిపి క్రైస్తవులు తమ రాజ్యాంగ హక్కులను నిర్భయంగా వినియోగించుకోనేలా



తగిన చర్యలు తీసుకోవాలని నేషనల్ కమిషన్ను అభ్యర్థించడం జరిగింది, క్రైస్తవ సమాజ సభ్యులు ఆందోళన చెందుతున్నారని కొన్ని సందర్భాల్లో ఎఫ్ ఐ ఆర్లు నమోదు చేయడం లేదని, మరికొన్ని సందర్భాల్లో బాధితులు లేదా పాస్టర్లపై ఎదురు కేసులు నమోదు చేయడం జరుగుతున్నదని, మతపరమైన సమావేశాల్లో తగినంత రక్షణ కల్పించకపోవడం మరియు హింస లేదా బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులపై సకాలంలో చర్యలు తీసుకుపోవడం క్రైస్తవులకు ఎస్సీ హోదాకు సంబంధించి కులంతో ముడిపడి ఉన్న సామాజిక, ఆర్థిక ప్రతికూలతలు మతమార్పిడితో తప్పనిసరిగా తొలగిపోవని అందువల్ల దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే అంశాన్ని సమానత్వం, సామాజిక న్యాయం మరియు కుల ఆధారిత వివక్షణ నుండి రక్షణ అనే దృక్పథంతో పరిశీలించాలని కోరడం జరిగింది..రాజ్యాంగ రక్షణలో మత స్వేచ్ఛ మరియు మైనార్టీ వర్గాల హక్కుల గురించి పోలీసులలో అవగాహన కల్పించాలని కోరడం జరిగింది. చట్ట ప్రకారం విద్వేషపూరిత ప్రసంగం మరియు హింసను ప్రేరేపించడం ప్రవర్తన రుజువైన చోట సమర్ధ వంతమైన అదికారిచే తగిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేయడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించాలి అని కోరడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని క్రైస్తవ మైనార్టీ వర్గం యొక్క హక్కులు మరియు భద్రతను పరిరక్షించడానికి కమిషన్ తన చట్టబద్ధమైన అధికార పరిధిలో తక్షణమే జోక్యం చేసుకోవాలని వినయ పూర్వకంగా కోరడం జరిగింది. ఈ విషయాలన్నిటినీ కమిషన్ పరిగణలో తీసుకోవాలని సంబంధిత అధికారుల నుండి తగిన నివేదికలు తెప్పించుకొని పౌరులందరికీ శాంతి, గౌరవం,మత స్వేచ్ఛ మరియు సమానత్వం కలిగించేలా సిఫార్సులు చేయాలని కోరారు . పైన పేర్కొన్న విషయాలన్నిటినిఒక నివేదిక రూపంలో మైనార్టీ కమిషన్ వైస్ చైర్ పర్సన్ మునావరి బేగం కు సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజు మరియు వైయస్సార్సీపి టీచర్స్ ఫెడరేషన్ దక్షిణ నియోజకవర్గ అధ్యక్షుడు దైవ కుమార్ మరియు పాస్టర్ జాన్ మేరీ పాల్గొనడం జరిగింది.



## మారిషస్ స్టేట్ హౌస్‌లో
# డాక్టర్ గజల్ గాన సందేశం...!

### ప్రపంచ శాంతి, సుహృద్భావం, మానవతా విలువలను గజల్స్‌తో గానం

### అభినందించిన మారిషస్ రాష్ట్రపతి ధరమ్ బీర్

**మారిషస్, సెప్టెంబర్ 26, జయ జయహే**

ప్రఖ్యాత గజల్ గాయకుడు, ట్రిపుల్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత డా. గజల్ శ్రీనివాస్ ఇటీవల మారిషస్ పర్యటనలో భాగంగా మారిషస్ రాష్ట్రపతి ధరమ్‌బీర్ గోకుల్ ఆహ్వానం మేరకు ఆ దేశ స్టేట్ హౌస్ (రాష్ట్రపతి భవన్) ను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా డా. గజల్ శ్రీనివాస్‌తో పాటు మారిషస్‌లోని ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రతినిధులను రాష్ట్రపతి సాదరంగా ఆహ్వానించారు. 2027 ఏప్రిల్‌లో మారిషస్‌లో నిర్వహించనున్న 5వ ప్రపంచ తెలుగు మహాసభల ఏర్పాట్లు, లక్ష్యాలు, కార్యక్రమాల గురించి రాష్ట్రపతి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో స్టేట్ హౌస్ సందర్శనకు వచ్చిన సీనియర్ సిటిజన్స్ బృందాన్ని రాష్ట్రపతి ధరమ్‌బీర్ గోకుల్ స్వయంగా డా. గజల్ శ్రీనివాస్‌కు పరిచయం చేసి, వారికి సందేశం అందించవలసిందిగా కోరారు. రాష్ట్రపతి అభ్యర్థన మేరకు డా. గజల్ శ్రీనివాస్ సీనియర్ సిటిజన్లను ఉద్దేశించి ప్రసంగిస్తూ, తన గజల్ గానం ద్వారా ప్రపంచ శాంతి, సౌభ్రాతృత్వం, సుహృద్భావం, మానవతా విలువలు, దేశాల మధ్య స్నేహ సంబంధాలు అనే సందేశాలను హృద్యంగా వినిపించారు. తెలుగు గజల్స్‌లోని భావాలను వారికి వివరించి ఆలపించగా, అక్కడి వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మారిషస్ రాష్ట్రపతి ధరమ్‌బీర్ గోకుల్ మాట్లాడుతూ, డా. గజల్ శ్రీనివాస్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని అభినందించారు. ప్రపంచ శాంతి కోసం, వివిధ దేశాలు--ప్రజల మధ్య సుహృద్భావాన్ని పెంపొందించేందుకు ఆయన తన గజల్ గానం, శాంతి యాత్రలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అలాగే శ్రీమద్భగవద్గీత ప్రచారం ద్వారా చేస్తున్న సేవలను ప్రశంసించారు. రాష్ట్రపతి ధరమ్‌బీర్ గోకుల్‌తో పాటు ఆయన సతీమణి బృందా గోకుల్ కూడా డా. గజల్ శ్రీనివాస్ చేస్తున్న విశ్వశాంతి, సాంస్కృతిక సేవలను అభినందించారు. అనంతరం స్టేట్ హౌస్‌లో రాష్ట్రపతి ధరమ్‌బీర్ గోకుల్ డా. గజల్ శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు.



## శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకున్న సింగర్ వెల్‌మురుగన్

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్26, జయ జయహే**

శ్రీకాళహస్తి: తమిళనాడు ఫిల్మ్ ఇండస్ట్రీకి చెందిన ప్రముఖ గాయకుడు వెల్‌మురుగన్ శనివారం శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ దక్షిణ గోపురం వద్ద రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి, మాజీ శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యుడు బుల్లెట్ జయశ్యామ్ రాయల్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం వెల్‌మురుగన్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దినేష్, సోహైల్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాలకు టెండర్లు

### అక్టోబర్ 1 వరకు దరఖాస్తులు

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 26, జయ జయహే**



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో 10 మద్యం దుకాణాలకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ లావణ్య తెలిపారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘ పరిధిలో 3, ఏర్పేడు 3, తొట్టంబేడు 3, బీఎన్ కండ్రిగ పరిధిలో ఒక దుకాణం ఉన్నట్లు పేర్కొన్నారు.ఒక్కో దరఖాస్తుకు రూ.3 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజుగా రూ.1,000 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్, హైబ్రిడ్, ఆఫ్‌లైన్ విధానాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 24 నుంచి అక్టోబర్ 1 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, అక్టోబర్ 3న వెరిఫికేషన్, 5న ఉదయం 8 గంటలకు కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు శ్రీకాళహస్తి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

# విజ్ఞాన పోటీలతో విద్యార్థుల్లో జాతీయ అవగాహన

## వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ అధ్యక్షులు జీవీ రవిరాజు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 26, జయ జయహే**

విద్యార్థులు పుస్తకాల్లోని పాఠాలకే పరిమితం కాకుండా భారతదేశ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, భౌగోళికం, విజ్ఞానం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలని వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ అధ్యక్షులు జీవీ రవిరాజు అన్నారు. ఇలాంటి విజ్ఞాన ఆధారిత పోటీలు విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని, పోటీతత్వాన్ని పెంచడంతో పాటు దేశంపై అవగాహనను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. భారత వికాస్ పరిషత్ శ్రీ రాణి రుద్రమదేవి, అల్లూరి సీతారామరాజు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ద్వారకానగర్‌లోని విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీలో నిర్వహించిన 'భారత్ కో జానో--2025-26' జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు రవిరాజు ముఖ్య అతిథిగా హాజరై విజేతలను అభినందించారు.జిల్లాలోని 16 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆగస్టు 31న నిర్వహించిన ఆల్ ఇండియా భారత్ కో జానో స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపికైన విద్యార్థులను జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా విభజించి జిల్లా స్థాయి పోటీ నిర్వహించారు.సీనియర్స్ విభాగంలో సాయి చైతన్య విద్యా



నికేతన్ ప్రథమ, ఏవీకే పాఠశాల ద్వితీయ, విశ్వతేజ పాఠశాల తృతీయ స్థానాలు సాధించగా, జూనియర్స్ విభాగంలో డీఏవీ పాఠశాల ప్రథమ, శ్రీ విద్యా ఇంగ్లిష్ మీడియం పాఠశాల ద్వితీయ, గీతా పబ్లిక్ పాఠశాల తృతీయ స్థానాలు సాధించాయి. ఈ సందర్భంగా జీవీ రవిరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశ చరిత్ర, సంస్కృతి, జాతీయ విలువలపై ఆసక్తి పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. "విజ్ఞాన పోటీలు కేవలం బహుమతుల కోసం కాకుండా విద్యార్థుల్లో జ్ఞానాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచే వేదికలుగా నిలవాలి" అని అన్నారు. విజేతలతో పాటు పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థిని ఆయన అభినందించారు. శ్రీ రాణి రుద్రమదేవి శాఖ అధ్యక్షురాలు



టి. సత్యశ్రీ లక్ష్మీదేవి, కార్యదర్శి అనితా మోహ్తా, కోశాధికారి అడపా గీత, సంస్కార్ ప్రముఖ్ పద్మవాణి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అల్లూరి సీతారామరాజు శాఖ అధ్యక్షుడు డి.ఎం. రావు, ఉపాధ్యక్షుడు వి. శివకుమార్ రెడ్డి, కార్యదర్శి ఎం. నరేన్, కోశాధికారి పి.వి. నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులు తదుపరి రాష్ట్ర స్థాయి 'భారత్ కో జానో' క్విజ్ పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వాలంటీర్లు, భారత వికాస్ పరిషత్ సభ్యులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



## హైకోర్టు న్యాయమూర్తిని మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ

**విజయనగరం జయజయహే**

విజయనగరం కోర్టు కాంప్లెక్స్ లో నిర్వహించే జ్యుడిషియల్ అధికారుల కాన్ఫరెన్స్ మరియు వర్క్ షాప్ లో పాల్గొనేందుకు శనివారం జిల్లాకు విచ్చేసిన హైకోర్టు న్యాయుర్తి వి.సుజాత గారిని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మర్యాద పూర్వకంగా కలిసి, పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి ఎం.బబిత ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## జనసేనలోకి చేరికలు

**విజయనగరం (:జయ జయహే)**

విజయనగరం పట్టణ పరిధిలోని 22వ డివిజన్ బాబామెట్టలో జనసేన పార్టీలోకి చేరికలు చోటుచేసుకున్నాయి. ఏపీఎస్ఆర్‌టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెదమజ్జి సత్యనారాయణ చొరవతో శనివారం దాదాపు 25 కుటుంబాలకు చెందిన పలువురు జనసేన పార్టీలో చేరారు.ఆంధ్రప్రదేశ్ తూర్పు కాపు సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీలోకి వచ్చిన నూతన సభ్యులకు ఆమె గౌరవపూర్వకంగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గురాన అయ్యలు, నడిపెన శ్రీనివాసరావు, గంట్లాన పుష్ప కుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన పలువురు మాట్లాడుతూ జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు కట్టుబడి పనిచేస్తామని స్పష్టం చేశారు. విజయనగరంలో జనసేన పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు



## జిల్లా పరిషత్ కార్యాలయం ప్రారంభించిన కలెక్టర్

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి జిల్లా ఏర్పడిన అనంతరం తొలిసారిగా జిల్లా పరిషత్ కార్యాలయం ప్రభుత్వ సొంత భవనంలో ప్రారంభం కావడం శుభపరిణామని ఈ కార్యక్రమం కీ విచ్చేసిన మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు జిల్లా పరిషత్ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాడుగుల శాసనసభలు బండారు సత్యనారాయణమూర్తి పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ఈరోజు అనకాపల్లికీ చాలా శుభదినం అని జిల్లా ఏర్పడిన తర్వాత అనకాపల్లికి ప్రత్యేక గుర్తింపుతో జిల్లా పరిషత్ కార్యాలయం సొంత భవనంలోకి రావడం విజయానికి సంకేతం అని ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని అనకాపల్లి అభివృద్ధికి ఇది ఆరంభం అని రామకృష్ణ పేర్కొన్నారు ప్రస్తుత జిల్లా పరిషత్ కార్యాలయం పక్కన ఉన్న పాత భవనాలను తొలగించే అక్కడ నాలుగు అంతస్తుల ఆధునిక భవనం నిర్మిస్తే ప్రస్తుత కార్యాలయంతో అనుసంధానం చేస్తే సమావేశాలు జనరల్ బాడీ సమావేశాలు అతిథి గృహాలు తదితర అవసరాలకు ఉపయోగపడేలా ఒక సమగ్ర పరిపాలన కేంద్రంగా అభివృద్ధి చేయూచ్చని ఆయన పేర్కొన్నారు జిల్లా పరిషత్ మిగిలిన సుమారు ఎకరం స్థలాన్ని అభివృద్ధి చేసి పార్కు గెస్ట్ హౌస్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తే అనకాపల్లి ఆకర్షణగా నిలుస్తుందని ఆయన తెలిపారు అనకాపల్లి ఉత్తర ఆంధ్రాలో అభివృద్ధికి ఇంజన్ గా ఎదుగుతుందని కూటమి ప్రభుత్వ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో జిల్లా అభివృద్ధి వేగంగా పెరిగిందని అనకాపల్లిని అధిక రెవెన్యూ సాధించే జిల్లా గానే కాకుండా తలసరి ఆదాయంలోను ముందుండే జిల్లాగా తీర్చిదిద్యానికి చర్యలు జరుగుతున్నాయని ప్రధానమంత్రి ఆశీస్సులతో జిల్లాకు పెద్ద పరిశ్రమలు వస్తున్నాయని పారిశ్రామిక అభివృద్ధి పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని గ్రామీణ అభివృద్ధి ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టు లాంటిదని పేర్కొన్నారు పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలకు స్థానిక సంస్థలకు ఆర్థిక సంఘం నిధులు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు చూసుకుంటున్నారని గతంలో గ్రామాలకు చేరాల చిన్న నిధులు మళ్లించబడ్డాయని ప్రస్తుతం గ్రామాలకు వైభవం తీసుకురావాలని లక్ష్యంతో నిధులను సక్రమంగా వినియోగించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని గ్రామీణ రహదారుల అభివృద్ధికి చేపడుతున్న పల్లె పథకాల ద్వారా వేల కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం జరుగుతుందని ఫలితంగా గ్రామీణ ప్రాంతాల రవాణా సౌకర్యాలు మెరుగుపడుతున్నాయని వారి పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులకు ప్రభుత్వ అధికారులు కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు




# జీవిత సత్యం

జీవితం ఒక పెద్ద పుస్తకం,మరియు నిఘంటువు.ప్రతి రోజు ఒక నూతన పుట లోకి అడుగుపెడతాము. భావోద్వేగాల సమ్మిళితమే పుటలతో ఉన్న జీవిత పుస్తకం. కొన్ని పుటలలో ఆనందం,కొన్ని పుటలలో ఆంతరంగిక భావనలతో కూడిన సందేహాలు, కన్నీళ్లు, నష్టాలు, సుఖాలు,లాభాలు. చివరికి అర్థమయ్యే ఒకే ఒక నిజం ఏమిటంటే జీవితం అనేది అంతర ఆలోచన. మన మనసులో అంతర్వాణి ఒక్కో విషయంలో వద్దు అని ఒక్కొక్క విషయంలో మంచిది అని సలహాని ఇస్తుంది. ఆ సలహాను పాటిస్తే మనదైన జీవితం క్రొత్తదనంతో నవీనపథం లో ప్రయాణిస్తుంది. ఆ అంతర్వాణి అనేది భగవంతుడు యొక్క మాట అని మనం అర్థం చేసుకోగలిగితేనే మన జీవితాన్ని సరైన బాటలో నడిపించగలుగుతాము.జీవిత సత్యం ధనములో లేదు పేరులో లేదు, ఆస్తి,అంతస్థుల్లో లేదు, అది మన మంచి ఆలోచనలో ఉంది. ఉన్నదానితో సంతోషించడం. మంచి దారిలో నడవడం, మంచి గా బ్రతకడం. నిన్నటిటి రోజు వెళ్లిపోయింది. రేపటి రోజు ఇంకా రాలేదు. ఈ క్షణం మన జీవితంలో ఉన్న బంగారు కాలం. ఇదే నిజం. ఈ క్షణంలో ఉన్న మనం నిజాయితీగా బ్రతకడమే ధర్మ సత్యం. చాలా మంది భక్తి అంటే దేవాలయానికి వెళ్లడం అనుకుంటారు అసలైన భక్తి అనగా ఒకరికి ధైర్యం చెప్పడమే నిజమైన అసలైన భక్తి. ఇది మన భారతీయ సంస్కృతి. ఈరోజు ఉన్న కష్టం రేపు ఉండదు. ఈరోజు ఉన్న సుఖం రేపు ఉండదు అని తెలుసుకొని మన అంతర్వాణి లో దాచుకున్న ఈ విలువైన క్షణం చాలా గొప్పది. మనము బాధలో ఉన్నప్పుడు మన మౌనమే మనకు సమాధానాన్ని ఇస్తుంది అనే విషయం గుర్తించగలగాలి.జీవితం అనేది దేవుడు ఇచ్చిన ఒక అపూర్వమైన బహుమతి. కాలం ఎవరికోసం ఆగదు.ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకుంటూ కాలానికి గౌరవం ఇవ్వడమే జీవిత సత్యం.




రచన..
ఏ. బాల సౌజన్యకుమారి
తెలుగు ఆచార్యులు, నంది అవార్డు గ్రహీత,
ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త.

# సంపాతి-బలహీనతలోనూ చేయగల సహాయం

## రెక్కలు కోల్పోయినా దృష్టి కోల్పోలేదు




రామాయణంలో సంపాతి పాత్ర శారీరక పరిమితులను అధిగమించిన జ్ఞానం, అనుభవం, సేవాభావానికి ప్రతీక. సంపాతి, జటాయువు సోదరుడు. యౌవనంలో ఇద్దరూ ఆకాశంలో ఎగురుతూ సూర్యునికి సమీపంగా వెళ్లినప్పుడు, జటాయువును తీవ్రమైన వేడి నుంచి రక్షించేందుకు సంపాతి తన రెక్కలను విస్తరించాడు. సోదరుడిని కాపాడినప్పటికీ, అతని రెక్కలు కాలిపోయాయి. ఎగరలేని స్థితిలోనూ అతను జీవితం పట్ల ఆశను, తన చుట్టూ జరుగుతున్న విషయాలను గమనించే శక్తిని కోల్పోలేదు.ఎగరడమే జీవనశక్తిగా ఉన్న పక్షికి రెక్కలు కోల్పోవడం తీవ్రమైన విషాదం. సంపాతి శారీరకంగా బలహీనుడయ్యాడు; కానీ అతని దృష్టి, జ్ఞాపకశక్తి, అనుభవం అంతరించిపోలేదు. ఒకప్పుడు తన సోదరుడిని కాపాడేందుకు ఉపయోగించిన శక్తి అతని వద్ద లేకపోయినా, మిగిలిన సామర్థ్యాలతో మరొకరికి సహాయపడే అవకాశం వచ్చింది.

### నిరాశలో ఉన్న వానరులకు దిశ

సీతను వెతుకుతూ దక్షిణ దిశకు వెళ్లిన వానరులు ఎటువంటి సమాచారం దొరకక నిరాశ చెందుతారు. తమ ప్రయత్నం విఫలమైందని భావిస్తున్న సమయంలో సంపాతి వారిని కలుసుకుంటాడు. జటాయువు మరణవార్త తెలుసుకొని బాధపడినా, సీతాన్వేషణలో తనకు తెలిసిన విషయాన్ని దాచుకోడు. సముద్రం అవతల లంకలో సీత ఉన్నట్లు వారికి తెలియజేస్తాడు.

సంపాతి స్వయంగా లంకకు ఎగిరి వెళ్లలేదు. రావణునితో యుద్ధం చేయలేదు. సీతను విడిపించలేదు. అయినప్పటికీ అతను అందించిన సమాచారం వానరుల అన్వేషణకు దిశను ఇచ్చింది. హనుమంతుడు లంకకు వెళ్లడానికి, సీతను కనుగొనడానికి, తరువాతి కార్యాచరణ సాగడానికి ఆ మార్గదర్శనం కీలకమైంది. ఒక గొప్ప కార్యంలో ప్రతి ఒక్కరూ ఒకే పని చేయాల్సిన అవసరం లేదని సంపాతి పాత్ర గుర్తుచేస్తుంది.

### సామర్థ్యాన్ని శరీరంతో మాత్రమే కొలవకూడదు

సంపాతి కథ మనిషి విలువను కేవలం శారీరక బలం, వయస్సు లేదా పదవితో నిర్ణయించకూడదని చెబుతుంది. ఒక పని స్వయంగా చేయలేని వ్యక్తి దానిని ఎలా చేయాలో సూచించగలడు. ప్రయాణించలేని వ్యక్తి సరైన దారిని చూపగలడు. పోరాడలేని వ్యక్తి పోరాటానికి అవసరమైన జ్ఞానాన్ని అందించగలడు.

ఆధునిక సమాజంలో వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక అనారోగ్యంతో జీవిస్తున్నవారిని ఇతరులపై ఆధారపడే వ్యక్తులుగా మాత్రమే చూసే ధోరణి కనిపిస్తుంది. వారి అనుభవం, పరిశీలనా శక్తి, జ్ఞానం, సృజనాత్మకతను గుర్తించకపోతే సమాజమే అమూల్యమైన అవకాశాలను కోల్పోతుంది. సహాయం అవసరమయ్యే వ్యక్తి కూడా మరొక సందర్భంలో ఇతరులకు సహాయపడగలడు.

### వృద్ధుల అనుభవం సమాజ సంపద

ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు విద్యార్థులకు మార్గదర్శనం చేయగలడు. వృద్ధ రైతు నేల స్వభావం, విత్తనాలు, స్థానిక వాతావరణం గురించి యువతరానికి విలువైన జ్ఞానం అందించగలడు. బయటకు వెళ్లలేని రచయిత తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్యపరచగలడు. దివ్యాంగుడు తగిన సదుపాయాలు, సాంకేతికత సహాయంతో పరిశోధన, కళ, పరిపాలన వంటి రంగాల్లో తన ప్రతిభను చూపగలడు.

అవకాశం ఇవ్వకుండా ఎవరికైనా సామర్థ్యం లేదని నిర్ణయించడం అన్యాయం. అందుబాటులో ఉండే విద్య, ఉపాధి, రవాణా, సాంకేతిక సదుపాయాలు కల్పించినప్పుడు ఎన్నో ప్రతిభలు వెలుగులోకి వస్తాయి. పెద్దల మాటను ఓపికగా వినడం, వారి అనుభవాన్ని గౌరవించడం కూడా తరాల మధ్య బంధాన్ని బలపరుస్తుంది.

### అన్యాయాన్ని గమనించినవారు మౌనంగా ఉండకూడదు

సంపాతి తనకు తెలిసిన విషయాన్ని వానరులకు చెప్పినట్లే, సమాజంలో అన్యాయం లేదా అక్రమం జరిగినప్పుడు దానిని గమనించినవారు తమకు సాధ్యమైన బాధ్యతాయుతమైన సహాయం చేయాలి. ఉదాహరణకు, పెద్దలకు ఎవరో ఎదురు తిరిగి బెదిరించినా, వేధించినా, వారి హక్కులను హరించినా, సంఘటనను చూసినవారు అవసరమైతే సాక్షులుగా నిలబడవచ్చు. ఒంటరిగా ఉన్న వృద్ధుడికి నిజం చెప్పగల సాక్షి తోడుగా ఉండటం గొప్ప ధైర్యాన్నిస్తుంది.

అలాగే, మోసం, హింస లేదా ఇతర అక్రమం గురించి విశ్వసనీయ సమాచారం తెలిసినప్పుడు సంబంధిత అధికారులకు లేదా కార్యాలయాలకు తెలియజేయడం సామాజిక బాధ్యత. అయితే విన్న మాటను నిజంగా ప్రచారం చేయకుండా, తాము చూసిన లేదా ధృవీకరించగల వివరాలను మాత్రమే చెప్పాలి. బాధితుల గౌరవం, భద్రతను కాపాడుతూ తగిన మార్గంలో సమాచారం అందించాలి. సహాయం చేయడానికి శారీరకంగా పోరాడటం ఒక్కటే మార్గం కాదు; నిజం చెప్పడం, సాక్ష్యాన్ని భద్రపరచడం, సరైన వ్యక్తికి సమాచారం చేరవేయడం కూడా సహాయమే.

### సరైన సమాచారం కూడా సేవే

సంపాతి అందించినది ధనం లేదా ఆయుధం కాదు--- సరైన సమాచారం. నేటి కాలంలో ప్రమాదంలో ఉన్నవారి వివరాలను సంబంధిత అధికారులకు తెలియజేయడం, రక్తదాతను రోగి కుటుంబంతో కలపడం, నిరుద్యోగికి ఉద్యోగ సమాచారం ఇవ్వడం, విద్యార్థికి ఉపకారవేతనం గురించి చెప్పడం గొప్ప సహాయాలే. సమాచారం సరైన సమయంలో, సరైన వ్యక్తికి చేరితే దాని ప్రభావం మరింత పెరుగుతుంది.

కొన్నిసార్లు మనకు సమస్యను స్వయంగా పరిష్కరించే శక్తి ఉండకపోవచ్చు. అయినా సహాయం చేయగల వ్యక్తిని గుర్తించడం, బాధితుడి మాటను శ్రద్ధగా వినడం, అవసరమైన కార్యాలయానికి అతనితో పాటు వెళ్లడం వంటి పనులు చేయవచ్చు. చిన్నదిగా కనిపించే ఈ చర్యలే కష్టంలో ఉన్నవారికి ముందడుగు వేసే ధైర్యాన్నిస్తాయి.

### "నేనేం చేయగలను?" అనే నిరాశ వద్దు

ధనం, అధికారం, శారీరక శక్తి లేనందున తాము ఎవరికీ ఉపయోగపడలేమని కొందరు భావిస్తారు. సంపాతి జీవితం ఈ భావనను తిరస్కరిస్తుంది. ప్రతి వ్యక్తి వద్ద అనుభవం, మాట, జ్ఞానం, పరిచయం, సమయం లేదా ప్రోత్సాహం రూపంలో సహాయపడే శక్తి ఉంటుంది. అవసరమైనప్పుడు నిజానికి సాక్షిగా నిలబడే ధైర్యం కూడా ఒక విలువైన సేవే.

బలహీనత మన విలువను ముగించదు; సేవ చేసే విధానాన్ని మాత్రమే మార్చుతుంది. చేయలేనిదాన్ని తలచుకొని కుంగిపోవడం కంటే, చేయగలిగినదాన్ని గుర్తించి ఇతరుల మేలు కోసం వినియోగించాలి. రెక్కలు లేకున్నా వానరులకు దారి చూపిన సంపాతి, మన వద్ద ఉన్న చిన్న సామర్థ్యాన్ని కూడా సరైన సమయంలో ఉపయోగిస్తే అది ఒక గొప్ప కార్యానికి తోడ్పడుతుందని గుర్తుచేస్తాడు.



ప్రొఫెసర్
విశ్వేశ్వర రావు
చెనమల్లు

# గుర్రం జాషువా...అక్షరాన్ని ఆయుధంగా మార్చిన మహాకవి...!

## సామాజిక అసమానతలపై కలంతో తిరుగుబాటు చేసిన మహనీయుడు

## 28న జాషువా జయంతి సందర్భంగా..

**తెలుగు నేలపై ఎందరో కవులు పుట్టారు. ఎన్నో పద్యాలు పుట్టాయి. ఎన్నో కావ్యాలు వెలువడ్డాయి. కానీ సమాజం అంచుల్లో నిలబడి, తన చుట్టూ ఉన్న అసమానతలను గుండెల్లోకి తీసుకుని, వాటిని అక్షరాలుగా మార్చి, ఆ అక్షరాలతోనే సమాజాన్ని ప్రశ్నించిన కవి గుర్రం జాషువా. జాషువా పేరు వినగానే మనకు గుర్తుకు వచ్చేది కేవలం ఒక మహాకవి కాదు. ఒక ఆవేదన. ఒక ప్రశ్న. ఒక ఆత్మగౌరవం. ఒక తిరుగుబాటు. ఒక మానవతా స్వరం. కవిత్వం అంటే కేవలం అందమైన పదాల అల్లిక కాదని, కవిత్వం అంటే సమాజాన్ని మేల్కొలిపే శక్తి అని తన రచనల ద్వారా నిరూపించిన మహనీయుడు గుర్రం జాషువా. సమాజంలో మనిషిని మనిషిగా చూడని పరిస్థితులను ఆయన చూశారు. కులం పేరుతో అవమానించబడిన మనుషుల బాధను ఆయన అనుభవించారు. దేవాలయాల గడపల దగ్గర ఆగిపోయిన అడుగులను చూశారు. పుట్టుక ఆధారంగా మనిషి విలువను నిర్ణయించే వ్యవస్థను చూశారు. కానీ ఆ బాధల ముందు ఆయన కలం ఆగిపోలేదు. ఆ బాధే ఆయన కలానికి సిరాగా మారింది. ఆ అవమానమే ఆయన పద్యానికి ఆవేశంగా మారింది. ఆ ఆవేదనే ఆయన సాహిత్యానికి సామాజిక చైతన్యంగా మారింది. అందుకే గుర్రం జాషువా తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేకమైన శిఖరం.**

### వినుకొండ నుంచి తెలుగు సాహిత్య శిఖరాల వరకు..!

1895 సెప్టెంబర్ 28న వినుకొండలో జన్మించిన గుర్రం జాషువా సామాజికంగా వెనుకబడిన వర్గానికి చెందిన కుటుంబంలో పెరిగారు. ఆయన జీవించిన కాలం ఈనాటి కాలం కాదు. విద్య అందరికీ సులభంగా అందుబాటులో లేని రోజులు. కుల వివక్ష బలంగా ఉన్న రోజులు. అంటరానితనం సామాజిక జీవితాన్ని శాసించిన రోజులు. అలాంటి పరిస్థితుల్లో ఒక వ్యక్తి కవిగా ఎదగడం మాత్రమే కాదు, తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక చిరస్థాయి స్థానాన్ని సంపాదించుకోవడం సాధారణ విషయం కాదు. జాషువా ఎదుర్కొన్న అడ్డంకులు ఎన్నో. కానీ ఆయన వెనక్కి తగ్గలేదు. ఆయనకు పుస్తకం ఒక పాఠ్యపుస్తకం మాత్రమే కాదు. అది ప్రపంచాన్ని అర్థం చేసుకునే కిటికీ. ఆయనకు పద్యం కేవలం ఛందస్సు కాదు. అది సమాజాన్ని ప్రశ్నించే గొంతుక. ఆయనకు కవిత్వం కేవలం కళ కాదు. అది మానవత్వం కోసం చేసే పోరాటం.

### 'గబ్బిలం' --- గుడి గడప దగ్గర నిలిచిన మనిషి గొంతు...!

జాషువా సాహిత్యాన్ని ప్రస్తావించినప్పుడు ముందుగా గుర్తుకు వచ్చే రచన 'గబ్బిలం'. తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన ఈ రచనలో ఒక గొప్ప ప్రతీకను జాషువా ఉపయోగించారు. దేవాలయంలోకి ప్రవేశించే అవకాశం లేని మనిషి తన సందేశాన్ని పరమేశ్వరుడికి చేరవేయడానికి గబ్బిలాన్ని దూతగా భావించడం వెనుక ఉన్న ఆలోచన అత్యంత లోతైనది. ఇక్కడ గబ్బిలం ఒక పక్షి మాత్రమే కాదు. అది ఒక ప్రతీక. అది ఒక అణగారిన మనిషి గొంతు. అది సమాజం తలుపులు మూసివేసిన వ్యక్తి యొక్క ఆవేదన. దేవుడి సృష్టిలో పుట్టిన మనిషికి దేవుడి గుడి గడప ఎందుకు మూసివేయబడాలి. ఈ ఒక్క ప్రశ్న చాలు జాషువా



సాహిత్యంలోని సామాజిక తీవ్రతను అర్థం చేసుకోవడానికి.

మనిషిని పుట్టుక ఆధారంగా విభజించిన సమాజాన్ని ఆయన ప్రశ్నించారు. దేవుడి ముందు అందరూ సమానమైతే, దేవుడి గడప దగ్గర మనుషుల మధ్య ఎందుకు అసమానత. ఇది కేవలం జాషువా కాలానికి సంబంధించిన ప్రశ్న కాదు.

### ఇది ప్రతి తరానికి సంబంధించిన ప్రశ్న...!

కులం మనిషిని నిర్ణయించదు .. మానవత్వమే మనిషి విలువ..జాషువా కవిత్వంలోని అత్యంత గొప్ప సందేశం మానవ సమానత్వం. ఒక మనిషి ఏ కుటుంబంలో పుట్టాడు. ఏ కులంలో పుట్టాడు. ఏ మతానికి చెందినవాడు. ఎంత ఆస్తి ఉంది.

అనే ప్రశ్నలకంటే, అతను మనిషిగా ఎలా జీవిస్తున్నాడు...అనేదే ముఖ్యమని ఆయన సాహిత్యం మనకు గుర్తుచేస్తుంది.

సమాజం నిర్మించిన కుల గోడలు మనుషుల మధ్య దూరాలను పెంచవచ్చు. కానీ ప్రకృతి ముందు అందరూ మనుషులే.

పుట్టేటప్పుడు ఎవరికీ కులం తెలియదు. ఆకలి వేసినప్పుడు కులం అడగదు. కన్నీరు పెట్టినప్పుడు కులం రంగు మారదు.

మరణం వచ్చినప్పుడు కులం మనిషిని కాపాడదు. అయితే మనిషి మనిషిని ఎందుకు విభజించాలి. జాషువా సాహిత్యం మనలో ఈ ప్రశ్నను కలిగిస్తుంది.

### అవమానాన్ని అక్షరంగా మార్చుకున్న కవి...!

జాషువా జీవితంలో ఎదురైన అనుభవాలు ఆయన కవిత్వాన్ని ప్రభావితం చేశాయి. అయితే ఆయన వ్యక్తిగత బాధను కేవలం తనకే పరిమితం చేయలేదు. తన అనుభవంలో కనిపించిన సామాజిక సమస్యను మొత్తం సమాజం ముందు ఉంచారు. ఇదే నిజమైన కవి లక్షణం. కన్నీటిని మాత్రమే రాయడం ఒక వ్యక్తి అనుభవం. కానీ తన కన్నీటిలో సమాజం కన్నీటిని చూడడం మహాకవి లక్షణం. జాషువా అలా చూశారు. అందుకే ఆయన పద్యం ఒకరి బాధను దాటి అనేకమంది బాధకు ప్రతినిధిగా నిలిచింది.



రచన: ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ

# ఆదర్శం ఔన్నత్యం ఆర్య వైశ్య నేతలు సహజలక్షణాలు





## ఎమ్మెల్యే రోషన్ కుమార్

**జంగారెడ్డిగూడెం, (జయ జయహే )**

ఆర్యవైశ్యుల్లో ఎంతో ఔన్నత్యం ఆదర్శం ఉంటాయని అందుకే వారు అన్ని రంగాల్లోనూ రాణిస్తారని చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ కొనియాడారు. శనివారం స్థానిక అలపాటి కళ్యాణ మండపంలో ఏలూరు జిల్లా ఆర్యవైశ్య సంఘం రూరల్ కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగాజరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రోషన్ కుమార్ తాను ఎమ్మెల్యేగా చింతలపూడి నియోజకవర్గంలో ఎక్కువగా ఆర్యవైశ్య సంఘాల సమావేశాలకు హాజరై నట్టు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు కూడా ఆర్య వైశ్యులు అంటే ఎంతో మక్కువ అని అందుకే ఆయన అమరావతిలో అమర్ జీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. చింతలపూడి నియోజకవర్గంలో అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మద్ది దేవస్థానం తదితర కమిటీల్లో ఆర్యవైశ్యులకి తాను ప్రాముఖ్యతనిచ్చి నట్టుఎమ్మెల్యేపేర్కొన్నారు. రాబోయే రోజుల్లో జరగనున్న అన్ని ఎన్నికల్లోను ఆర్యవైశ్యులు కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ విధంగా ఆర్యవైశ్యలను అడిగే హక్కు మీ కుటుంబ సభ్యుడిగా నాకే ఉందని తప్పనిసరిగా మీరంతా మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే వత్తిడి చేశారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా రూరల్ కమిటీకి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

**అన్ని రంగాల్లో ఆర్యవైశ్య నేతలు ముందుండాలి**

ఈ సమావేశానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అని రంగాల్లోనూ వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ ప్రాంత మహిళలు ఎంతో మంచివారిని మహిళలు బంగారంతో సమానమని ఆయన అన్నారు. కులాంతర వ్యవహారాలను ప్రోత్సహించవద్దని పిలుపునిచ్చారు. ఇంతకుముందు రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా పనిచేసిన జంగారెడ్డిగూడెం వాసి చిన్ని రామ సత్యనారాయణ ఆర్యవైశ్య మహాసభ ఉనికిని కాపాడారని కొనియాడారు. మహాసభ భవన నిర్మాణానికి ఆయన నడుం బిగించారని అభినందించారు.



## మాజీ సర్పంచ్ చొరవతో పూడికపోయిన కాలువ శుభ్రం

**దేవరాపల్లి, సెప్టెంబర్ 26, జయ జయహే**

మండలంలోని కాశీపురం గ్రామంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలువలలో చెత్త చెదారం పేరుకుపోవడంతో ఎక్కడికక్కడే మురుగునీరు నిల్వ ఉండిపోయింది. దీనివలన స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక మాజీ సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, టిడిపి మండల పార్టీ మాజీ అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ చొరవతో గ్రామస్తులు శ్రమదానం చేసి కాలువలో పూడికపోయిన చెత్త చదారాన్ని తొలగించి శుభ్రపరిచారు. దీనివలన 150 కుటుంబాలు పడిన ఇబ్బందులు తొలిగాయి. ప్రత్యేక చొరవతో గ్రామస్తుల సహకారంతో కూడుకుపోయిన కాలువలను శుభ్రపరిచిన మాజీ సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మికి, చిటిమిరెడ్డి సూర్యనారాయణకి స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## దివ్యాంగులకు 57 ఉచిత మోటారు త్రిచక్ర వాహనాల పంపిణీ

**నిడదవోలు జయ జయ ప్రతినిధి :**

తూర్పుగోదావరి జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్ ఆవరణలో దివ్యాంగులకు 57 ఉచిత మోటారు త్రిచక్ర వాహనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దివ్యాంగులు స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహాయంలో భాగంగా ఈ వాహనాలను అందించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ దివ్యాంగులు, వయోవృద్ధుల సహాయ సంస్థ అధ్యక్షులు గుడిపూడి నారాయణస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘం--నిడదవోలు, మదర్ థెరిసా దివ్యాంగుల సంక్షేమ సంఘం--తాడిమల్ల ప్రతినిధులు ఆయనకు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. అనంతరం దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ర్యాలీ శివ, కార్యదర్శి వంగా కృప రమేష్, తాడిమల్ల మదర్ థెరిసా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మునుకోటి బాలాజీ తదితరులు నారాయణస్వామికి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి ఎంపికైన 57 మంది దివ్యాంగులకు వాహనాలను పంపిణీ చేశారు. ఈ వాహనాలు దివ్యాంగుల రాకపోకలకు, స్వయం ఉపాధి, ఉద్యోగ కార్యకలాపాలకు ఎంతగానో ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, సంయుక్త కలెక్టర్ వై. మేఘా స్వరూప్, అధికారులు, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## భారీ వర్షాలకు కూలిన గిరిజన ఇళ్లు.. బాధితులకు జనసేన అండ

**డుంబ్రిగూడ, సెప్టెంబర్ 26: జయ జయహే.**

అల్పపీడన ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ మండలంలోని పలు గ్రామాల్లో నిరుపేద గిరిజనుల ఇళ్లు దెబ్బతిన్నాయి. సొవ్వ పంచాయతీ పరిధిలోని కమలబంద గ్రామానికి చెందిన పాంగి నాగరాజు, వంతల సిల్కొ, వంతల బాలరాజు, దేముడువలసకు చెందిన కొర్ర త్రినాథ్, కొరంజిగూడ కు చెందిన పొందోయి రాములు, మలింగావలసకు చెందిన సుకూరు వెంకట్రావు, ఇళ్ల గోడలు వర్షాల ధాటికి పూర్తిగా కూలిపోయాయి. దీంతో ఆయా కుటుంబాలు నివాసానికి ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ నాయకులు బాధిత కుటుంబాలను పరామర్శించి, వారి ఇళ్లను పరిశీలించారు. డుంబ్రిగూడ మండల జనసేన ఐటీ ఇన్‌చార్జ్ గుజెల్లి రమేష్ ఆధ్వర్యంలో, సొవ్వ పంచాయతీ ఇన్చార్జి వంతల కృష్ణకుమార్, సాగర పంచాయతీ ఇన్చార్జి పాంగి ఆనందరావుల ఆహ్వానం మేరకు జనసేన నాయకులు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా రూరల్ సంయుక్త కార్యదర్శి బంగురు రామదాసు మాట్లాడుతూ. భారీ వర్షాలకు ఇళ్లు కోల్పోయి తీవ్రంగా నష్టపోయిన గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించాలని కోరారు. రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ అధికారులు వెంటనే సంఘటనా స్థలాలను సందర్శించి నష్టాన్ని అంచనా వేయాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాధిత కుటుంబాలకు నూతన గృహాల నిర్మాణానికి సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై డుంబ్రిగూడ తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబాల సమస్యను వివరించినట్లు తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే వరకు జనసేన పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సమయం మార్పు

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**



బ్యాంకు ఉద్యోగులు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల నగదు ఉపసంహరణ, పంపిణీ షెడ్యూల్‌లో మార్పు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 1వ తేదీ ఉదయం పింఛన్ల నగదును ఉపసంహరించుకుని, అదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నిడదవోలు మున్సిపాలిటీ పరిధిలోని పింఛనుదారులు ఈ మార్పును గమనించి, సంబంధిత స్వర్ణ వార్డు కార్యాలయాల పింఛను పంపిణీ సిబ్బంది ద్వారా అక్టోబర్ 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి తమ పింఛన్లు స్వీకరించాలని అధికారులు కోరారు.

## నేవల్ మెడికల్ యూనిట్ ఎన్‌సీసీ వార్షిక తనిఖీ

**'శిక్షణ' బహుళ ప్రయోజన శిక్షణా మందిరం ప్రారంభం**

**విశాఖపట్నం, సెప్టెంబర్ 26, జయ జయహే**




4(ఏ) నేవల్ మెడికల్ యూనిట్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో వార్షిక తనిఖీ - 2026 కార్యక్రమం శనివారం నిర్వహించారు. క్రమశిక్షణ, నావికాదళ సంప్రదాయాలు, అంకితభావం, నాయకత్వ లక్షణాలు మరియు దేశసేవ పట్ల క్యాడెట్లలో నిబద్ధతను ప్రతిబింబించేలా ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రూప్ కమాండర్ కమోడోర్ సుమంత రాయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ జి. మధు కుమార్, యూనిట్ కమాండింగ్ ఆఫీసర్, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు, పర్మనెంట్ ఇన్‌స్ట్రక్షనల్ స్టాఫ్, అతిథులు, ఎన్‌సీసీ క్యాడెట్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా "శిక్షణ" పేరుతో ఏర్పాటు చేసిన బహుళ ప్రయోజన శిక్షణా మందిరాన్ని ప్రారంభించారు. క్యాడెట్లకు నైపుణ్యాభివృద్ధి, క్రమశిక్షణతో కూడిన శిక్షణ, బృందస్ఫూర్తి మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఈ శిక్షణా మందిరం ఉపయోగపడనుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు సమీక్షా అధికారులు, కళాశాల యాజమాన్యం, శిక్షకులు మరియు మార్గదర్శకులకు కృతజ్ఞతలు తెలిపారు. వారి నిరంతర మార్గదర్శకత్వం, ప్రోత్సాహం క్యాడెట్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. దేశసేవ, క్రమశిక్షణ మరియు నాయకత్వ విలువలను మరింత బలోపేతం చేసుకుంటూ ముందుకు సాగాలని క్యాడెట్లు ప్రతిజ్ఞ చేశారు.

## మెడికల్ ఆఫీసర్ -2 పోస్టును తక్షణమే భర్తీ చేయాలి

**దేవరాపల్లి, సెప్టెంబర్ 26, జయ జయహే**



స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండవ మెడికల్ ఆఫీసర్ పోస్టును తక్షణమే భర్తీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రోగులకు మెరుగైన వైద్యం అందించడం కోసం 2005లో ఈ ఆసుపత్రిని 24 గంటల ఆసుపత్రిగా అప్ గ్రేట్ చేసి కొంతకాలం ఇద్దరు డాక్టర్లుతో వైద్య సేవలు అందించారని తెలిపారు. తరువాత డాక్టర్లు కొరత వల్ల ఒక్క డాక్టరుతోనే నడవగా, గత వైసిపి ప్రభుత్వంలో మళ్లీ ఇద్దరు డాక్టర్లును ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. అయితే రెండో మెడికల్ ఆఫీసర్ బదిలీపై వెళ్లి పోవడంతో ఆ పోస్టు ఖాళీగా ఉందని, దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ పిహెచ్సీకి ప్రధానంగా 48 గిరిజన గ్రామాల నుండి ఎక్కువగా రోగులు వస్తున్నారని, రాత్రిపూట డాక్టర్లు లేకపోవడంతో వారికి వైద్యం అందే పరిస్థితి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా గర్భిణులు, వృద్ధులు, చిన్నపిల్లలు, పాముకాటుకు గురైన వారు ఇలా అనేక మంది వైద్యం అందక ఇబ్బంది. పడుతున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి చొరవ తీసుకొని తక్షణమే సెకండ్ మెడికల్ ఆఫీసు పోస్టుతో పాటు వైద్య సిబ్బందిని నియమించడానికి మందులు కొరతను నివారించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.




## మత్తు వద్దు ఆరోగ్యమే ముద్దు

**అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు**

**అనకాపల్లి జయ జయహే**

నవభారత నిర్మాణంలో యువతే కీలకం మత్తు మహమ్మారికి బానిసలై భవిష్యత్తును చిది మేసుకోవద్దని జిల్లా అడిషనల్ ఎస్పీ సిహెచ్ శ్రీనివాసరావు యువతకు పిలుపునిచ్చారు కేంద్ర యువజన వ్యవహారాల తేడా మంత్రిత్వ శాఖ మై భారత్ ఆధ్వర్యంలో శనివారం అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో వికసిత్ భారత్ నస ముక్త యువ క్యాంపెన్లో భాగంగా జరిగిన నా ఆరోగ్యం నా గర్వం సమావేశం కి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ దేశ ప్రగతికి ఆరోగ్యమైన యువత ప్రధానమని అసలైన మూలధనం శారీరక మానసిక దృఢత్వంతో పాటు సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారానే ఉన్నత ఆలోచనలతో లక్ష్యాన్ని చేరుకోగలం అని పేర్కొన్నారు చనికానందానిచ్చే మాదగదరవ్యాల వలలో చిక్కుకొని ప్రాణాలు మీదుకు తెచ్చుకోవద్దని ఆయన యువతకు విజ్ఞప్తి చేశారు యువత అత్తమ్మ ఆరోగ్యాన్ని శ్రీరామరక్షగా గర్వంగా భావించి మత్తు రహిత సమాజం కోసం అడుగులు వేయాలి అని ఆయన ఉద్భోదించారు మరొక అడిషనల్ ఎస్పీ మోహన్ రావు మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు ఆరోగ్యకరమైన ఆహారం క్రమశిక్షణ వ్యాయామం క్రీడలు జీవితంలో భాగం చేసుకోవాలని ఆయన యువతకు సూచించారు ఈ కార్యక్రమంలో అధ్యక్షత వహించిన మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ గొర్ల మహేశ్వర రావు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల ఆరోగ్యంతో పాటు వ్యక్తిగత కుటుంబ సామాజిక జీవితం దెబ్బతింటుందని పదిమందిలో నవ్వుల పాలు అవుతామని సంఘంలో గౌరవం ఉండదని కనుక మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువత భవిష్యత్తు లక్ష్యాలు సాధనపై దృష్టి కేంద్రీకరించాలని ఆయన పేర్కొన్నారు

## నేడు వీఎంఆర్‌డీఏ పార్కులు, మ్యూజియంల్లో ఉచిత ప్రవేశం

**విశాఖపట్నం (జయ జయహే)**

ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ ఆధీనంలో ఉన్న పార్కులు, మ్యూజియంల్లో ఈ నెల 27న ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు వీఎంఆర్‌డీఏ ఛైర్పర్సన్ ఎంవి ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కేతన్ గార్గ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి వీఎంఆర్‌డీఏకు చెందిన సెంట్రల్ పార్కు, కైలాసగిరి, తెలుగు మ్యూజియం, సబ్ మెరైన్ మ్యూజియం, టి.యు-142, సీ- హరియర్ మ్యూజియం, తొట్లకొండ తదితర సందర్శన స్థలాల్లో సందర్శకులకు, పర్యాటకలకు ఉచిత ప్రవేశము ఉంటుందని, ఈ అవకాశాన్ని పర్యాటకులు మరియు సందర్శకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

# దేవరాపల్లిలో భారీగా అన్న సమారాధనలు

## స్వామివారిని దర్శించుకున్న పలువురు నాయకులు

**దేవరాపల్లి, సెప్టెంబర్ 26, జయ జయహే**





మండల కేంద్రంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా దేవరాపల్లిలోని విశ్వబ్రాహ్మణ మందిరం వద్ద, సన్ బాయ్స్ (మహేశ్వరి థియేటర్) వద్ద కొరుప్రోలు కల్లాలు (నేచరల్ బాయ్స్) ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు వేర్వేరుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కర్రి సత్యం, వరదపురెడ్డి లలిత నాయుడు, డాక్టర్ వరదపురెడ్డి సింహాచలం నాయుడు, కె. వి రమణ, వేచలపు అప్పలనాయుడు, గండిపడాల అప్పలరాజు, సోమిరెడ్డి పేరు నాయుడు, వాలేటి నాగరాజు, గుల్లిపల్లి మురళి, దీవి శంకర్రావు, కొల్లి ఈశ్వరరావు, గవిరెడ్డి సింహ, సబ్బవరపు మాలి బాబు, మిడతాడ శ్రీను, విశ్వబ్రాహ్మణ యూత్, కొరుప్రోలు కల్లాలు యూత్ సన్ బాయ్స్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

For a pure tomorrow..
జయహే

# వైద్య ఉద్యోగుల బాధలపై రాష్ట్రవ్యాప్త ఉద్యమం

**ఏఎన్ఎం లపై ఓటీపీ ల భారం**

**సర్వేలంటూ అదనపు పనిభారం**

**భారీ ధర్నాలో ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆస్కార్‌రావు హెచ్చరిక**

**విశాఖపట్నం, సెప్టెంబర్ 26, జయ జయహే**




ఏఎన్ఎంలపై పెరుగుతున్న పని భారాన్ని తక్షణమే తగ్గించి, క్షేత్రస్థాయి సిబ్బంది సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆస్కార్‌రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. లెప్రసీ (కుష్టు) కేసుల సర్వేలో ఇంటింటికీ వెళ్లి మొబైల్ ఓటీపీలు సేకరించే విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐఎన్‌టీయూసీ అనుబంధ ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం విశాఖ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట నిర్వహించిన 'మెరుపు ధర్నా'లో ఆస్కార్‌రావు ప్రసంగించారు. గత 15 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా డీఎంహెచ్ఓ కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. గుర్తింపు పొందిన సంఘంగా తమను చర్చలకు పిలిచి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. మొబైల్ ఓటీపీ ఆధారిత ఆరోగ్య సర్వేలను పూర్తిగా రద్దు చేసి, ఓటీపీ రహిత సర్వేలను మాత్రమే క్షేత్రస్థాయి సిబ్బందికి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎంలకు ఎఫ్ఆర్ఎస్ హాజరు విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలని, క్షేత్రస్థాయి విధుల్లో మొబైల్ అప్లికేషన్ల వినియోగాన్ని తగ్గించాలని కోరారు. వీఎస్అండ్‌డబ్ల్యూఎస్ ఏఎన్ఎంలను పీఆర్అండ్ఆర్‌డీ, ఎంఏఅండ్‌యూడీ శాఖల పరిధి నుంచి తొలగించి వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పూర్తి నియంత్రణలోకి తీసుకురావాలని అన్నారు. ఈ నెల 17న వెలగపూడిలో జరిగిన డిపార్ట్‌మెంట్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో 30 ప్రధాన డిమాండ్లతో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండ్యన్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఆస్కార్‌రావు తెలిపారు. అర్హత కలిగిన కాంట్రాక్ట్ పారామెడికల్, ఇతర ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించాలని, సర్దుబాటు జీఓ 32ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖతో పాటు రాజమండ్రిలోనూ ధర్నాలు జరుగుతున్నాయని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి చర్చలకు ఆహ్వానించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతామని ఆయన స్పష్టం చేశారు. "ప్రభుత్వమే తమను ఉద్యమాల వైపు నడిచే పరిస్థితి కల్పిస్తోంది. ఇకనైనా స్పందించి సమస్యలను పరిష్కరించాలి" అని ఆస్కార్‌రావు అన్నారు. ధర్నా అనంతరం డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ జగదీశ్వర్ రావుకు వినతి పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణ అధ్యక్షతన జరిగిన ధర్నాలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బి. మహేష్, కే. కోటేశ్వరరావు, టి. శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి కే. కృష్ణాజీ, సిటీ అధ్యక్షుడు వై. గోపి, జిల్లా, నగర నాయకులు, ఏఎన్ఎంలు, హెల్త్ సెక్రటరీలుపాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలలో నశముక్త భారత యువ కార్యక్రమాలు

**చోడవరం సెప్టెంబరు 26 జయ జయహే**



స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం నిర్వహణలో " జాతీయ సేవా పథకం దినోత్సవం, నషాముక్తభారత్ యువ " కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ పి కిరణ్ కుమార్ , వైస్ ప్రిన్సిపాల్ అనురాధ ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యాపక బృందం గాంధీ మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాతీయ సేవా పథకం యూనిట్స్ విద్యార్థులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ "సేవ "అనే కార్యక్రమం ఎవరికి వారు వారి మనసుల్లో స్వయంగా భావిస్తే తప్ప సేవ చేయలేరని అందుచేత ప్రభుత్వం వారు జాతీయ సేవా పథకం ద్వారా యువతలో అవగాహన కలిగించి, వ్యక్తిత్వ వికాసము, సమాజం పట్ల సేవా భావము కలిగి విద్యార్థులకు తెలియజేశారు .వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనురాధ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అన్ని పరిస్థితులను విద్యార్థులుగా అవగాహన కలిగి ఉండాలని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. సమన్వయకర్త ఎం రాజేశ్వరరావు, జాతీయ సేవా పథకం ఆవిర్భావశీ పెద్ద విషయాలు తెలియజేశారు. జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రత్న భారతి, "నశాముక్తభారత్ యువ" అవగాహన కార్యక్రమం గురించి సవివరంగా వివరించారు. ఈ సందర్భంగా కళాశాల నుండి జిల్లా స్థాయి ఎన్ఎస్ఎస్ యూనిట్ ఉత్తమ ప్రోగ్రాం ఆఫీసర్గా బిచ్చమ్మ ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్ డాక్టర్ పి కిరణ్ కుమార్ ఇతర అధ్యాపక బృందం అభినందించారు. కళాశాల నుంచి జాతీయ ఉత్తమ వాలంటీర్ గా రావాడా ప్రసాద్ ను ఎంపిక చేసినందుకు ఆంధ్ర యూనివర్సిటీ వారికి ధన్యవాదములు తెలిపారు. జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డి.మాల్యాద్రి, బి పిచ్చమ్మ, సీనియర్ సీనియర్ అధ్యాపకులు ఎన్వి రామకృష్ణ, డాక్టర్ రాజకుమార్, అకాడమిక్ సమన్వయకర్త డాక్టర్ మల్లిబాబు, సమన్వయకర్త డాక్టర్ పద్మావతి, డాక్టర్ లక్ష్మీ మంగమ్మ, డాక్టర్ జ్యోతి, డాక్టర్ సూర్యవతి, డాక్టర్ షర్మిలశ్రీ, డాక్టర్ లక్ష్మి, శ్రీ వెంకటేష్, శ్రీ నారాయణ, రామలక్ష్మి కోమల, హేమ గణేష్, పీడీ గణేష్ కుమార్ తదితర అధ్యాపక బృందం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## జిల్లా కూటమి నాయకులు ఎన్నికలపై సుదీర్ఘ చర్చ

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా టిడిపి కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా కూటమినేతల సమన్వయ సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో జనసేన టిడిపి ముఖ్య నాయకులతో పాటు మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి ఆయా నియోజకవర్గ ఇన్చార్జులు పంచకర్ల రమేష్ విశాఖ శాసనసభ్యులు వంశీకృష్ణ యాదవ్ ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ చింతకాయల రాజేష్ తదితర నాయకులకు ఈ సమావేశంలో పాల్గొన్నారు రానున్న గ్రేటర్ విశాఖ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక కూటమి అభ్యర్థుల విజయానికి సమన్వయంతో పనిచేయడం క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమయత్వం చేయడం నాయకులు సుదీర్ఘంగా చర్చించారు అలాగే కూటమి ప్రభుత్వం గత రెండు నెలల్లో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా తీసుకువెళ్లేందుకు అని అనుసరించవలసిన కార్యాచరణ పై నాయకులు సుదీర్ఘంగా చర్చించడం జరిగింది సమన్వయంతో కార్యకర్తల కృషితో రానున్న ఎన్నికల లో 100% స్ట్రైక్ రేట్ తో విజయాన్ని సాధించే లక్ష్యంతో ముందుకు సాగాలని ఈ సమావేశం నేతలు పేర్కొన్నారు




## చోడవరంలో నేడు బొడ్డేటి ఆర్ట్ గ్యాలరీ ప్రారంభం

**చోడవరం సెప్టెంబరు 26 జయ జయహే**

ప్రసిద్ధ చిత్రకారులు బొడ్డేటి సూర్యనారాయణ ప్రతిష్ఠాంతకంగా నెలకొల్పుతున్న బొడ్డేటి ఆర్ట్ గ్యాలరీ నీ ఆదివారం చోడవరంలో ప్రారంభోత్సవశీ చేయనున్నారు. ఇందుకు సంబంధించి శనివారం చిత్ర కళ పై నిర్వహించిన వర్క్ షాపునకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖ చిత్ర కారులు హాజరై ఎంతో నైపుణ్యం తో వివిధ అంశాలపై చిత్రాలను గీసి ప్రదర్శించారు.వర్క్ షాప్ కు ముఖ్య అతిథిగా విచ్చేసిన నన్నయ యూనివర్సిటీ పూర్వపు వైస్ ఛాన్సలర్ ఆచార్య ముర్రు ముత్యాల నాయుడు చిత్ర కళ సృజన కళ అని మేధో వికాసానికి దోహద కారీ అని,విద్యతో పాటు చిత్ర కళను నేర్చుకోవడానికి విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.బొడ్డేటి ఆర్ట్ గ్యాలరీ చిత్ర కళా సేవలను వినియోగించు కోవాలని,స్వలాభాపేక్ష లేకుండా వ్యవస్థాపకులు బొడ్డేటి సూర్యనారాయణ ఆర్ట్ గ్యాలరీ ని స్థాపించి నిస్వార్థ చిత్ర కళా సేవలను కొనియాడారు.హాజరైన చిత్ర కారులను అభినందించారు. గాయకులు.విశ్వనాథం ప్రార్థనా గీతం తో ఆర్క్ ప్రసాద్ అధ్యక్షతన..వ్యవస్థాపకులు బొడ్డేటి సూర్యనాయన ఆహ్వాన పరిచయ వాక్యాలతో జరిగిన కార్యక్రమం లో ప్రముఖ జర్నలిస్ట్ కోటేశ్వర రావు,ప్రేమ సమాజం రాజు,ఫోరం ఉపాధ్యక్షులు టి వి రమణ,సాకేత్ ఫౌండేషన్ ప్రకాష్,రచయత చిత్ర కారులు రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ వర్క్ షాప్ లో పాల్గొన్న ఆంధ్ర,తెలంగాణ,తమిళనాడు,కర్ణాటక, పశ్చిమ బెంగాల్,మహారాష్ట్ర,రాష్ట్రాల నుంచి వచ్చిన చిత్రకారులను అభినందించి బొడ్డేటి ఆర్ట్ గ్యాలరీ ప్రారంభోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. పాఠశాలలు కళాశాలలో చెందిన విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




## దేవి ఆలయ అభివృద్ధికి దాతలు మరింత సహకరించండి

**మాడుగుల సెప్టెంబరు 26 జయ జయహే**

మాడుగుల బస్టాండ్ ఆవరణలో వేంచేసి ఉన్న శ్రీ దేవి ఆలయ అభివృద్ధికి దాతలు ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది. శనివారం ఆలయంలో జరిగిన కమిటీ సమావేశంలో ఆలయ గౌరవ అధ్యక్షులు శ్రీనాథు శ్రీనివాసరావు. మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు,ఆలయ కార్యదర్శి అన్నంనీడి ప్రసాదరావు, కమిటీ అధ్యక్షుడు ఎస్వీ కొండలరావు తదితరులు మాట్లాడుతూ.. సుమారు 70 లక్షల రూపాయలతో ఆలయ అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ఇప్పటికే ఆలయంలో గర్భగుడిపై గాలిగోపురం తో పాటు రంగులు,షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం,విశాఖ డైరీ సహాయంతో షెడ్ నిర్మాణం, గుడిలో ఫ్లోరింగ్, మండపంలో ఫ్లోరింగ్, ఆలయం పై విగ్రహాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టమన్నారు. ప్రస్తుతం కిటికీలకు గ్లాస్ వేయిస్తున్నామని ఒక్కొక్క కిటికి కి25వేల రూపాయలు ఖర్చు అవుతుందని విరాళాలు దాతలు ముందుకు రావాలని కోరారు. అలాగే అక్టోబర్ నెలలో దసరా ఉత్సవాలకు భక్తులు ముందుకు వచ్చి విరాళాలు అందించాలని కొరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, సివిల్ ప్రైవేట్ మోటార్ వర్కర్స్ ప్రతినిధులు శ్రీనాధు వెంకటరాజు, కోడూరు కొండలరావు,లక్కీడపు సుందర రాజు, బి నరసింహమూర్తి, తాడి గణేష్, ఇల్లపురమణ, మేస్త్రి సూరిబాబు, కర్రీ ప్రసాద్, కర్రీ నాగ, ఖండిపిల్లి కొండలరావు, ఎలిశెట్టి సతీష్,శ్రీనాథు సతీష్, మల్లేశ్వరరావు,కోన శ్రీనుతోపాటు మోటార్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.




## శ్రీకాళహస్తిలో మెగా కార్డన్ సెర్చ్

**తొట్టంబేడు, సెప్టెంబర్ 26, జయ జయహే**

తొట్టంబేడు మండలం తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ ఏ. శ్రీనివాసులు ఆధ్వర్యంలో, శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి పర్యవేక్షణలో రాజీవ్‌నగర్ కాలనీలో శనివారం మెగా కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పోలీసులు కాలనీలో విస్తృతంగా తనిఖీలు చేపట్టి 78 ద్విచక్ర వాహనాలు, 12 ఆటోలు కలిపి మొత్తం 90 వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఆపరేషన్ 'త్రిశూల్'లో భాగంగా ప్రజలకు డ్రగ్స్ నిర్మూలన, మహిళలు--బాలికల భద్రత, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్)శ్రీ ఏ. శ్రీనివాసులు, శ్రీకాళహస్తి డీఎస్పీశ్రీ నరసింహమూర్తి , వన్ టౌన్ సిఐ సి.వెంకటేష్, టూ టౌన్ సీఐ నాగరాజు, రూరల్ సీఐ ఎస్.కె. ఇబ్రహీం,టూ టౌన్ ఎస్సై వై జ్యోతి, రేణిగుంట పోలీస్ స్టేషన్ల సీఐలు, సీఐ జయచంద్ర, ఆర్ఐ నాగభూషణం, ఆర్ఐ రమణారెడ్డితో పాటు పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## సీనియర్ అసిస్టెంట్‌గా కోటిపల్లి రమణబాబుకు పదోన్నతి

**అన్నవరం దేవస్థానంలో సేవలకు గుర్తింపుగా ప్రమోషన్**

**అన్నవరం, సెప్టెంబర్ 26, జయ జయహే**



అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కోటిపల్లి రమణబాబుకు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించింది. ఆయన విధి నిర్వహణలో చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పనితీరుకు గుర్తింపుగా ఈ పదోన్నతి లభించడం పట్ల సహచర ఉద్యోగులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. దేవస్థాన పరిపాలనా వ్యవహారాల్లో తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, సహచరులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ రమణబాబు మంచి పేరు సంపాదించుకున్నారు. భక్తులకు మెరుగైన సేవలు అందించడంలోనూ తన వంతు సహకారం అందిస్తూ విధుల పట్ల అంకితభావాన్ని చాటుకున్నారు. జూనియర్ అసిస్టెంట్‌గా సేవలు అందించిన రమణబాబు ఇప్పుడు సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించడంతో ఆయనకు మరింత బాధ్యత పెరిగిందని సహచరులు పేర్కొన్నారు. పదోన్నతితో ఆయన సేవలు మరింత విస్తృతంగా కొనసాగాలని, దేవస్థాన అభివృద్ధి, భక్తుల సేవలో మరింత కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కోటిపల్లి రమణబాబును దేవస్థానం సిబ్బంది, సహచరులు, శ్రేయోభిలాషులు అభినందించి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని శుభాకాంక్షలు తెలిపారు.



## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**డుంబ్రిగూడ, సెప్టెంబర్ 26 జయ జయహే.**

మండలంలోని సాగర పంచాయతీ కిల్లోగూడ లోటీచర్స్ డే సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను అరకు, కిల్లోగుడ--సొవ్వ క్లస్టర్‌కు చెందిన ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న కిల్లోగుడ పాఠశాల హెచ్ఎం నాగేశ్వరరావు, కొరంజిగుడ మోడల్ స్కూల్ హెచ్ఎం నరసింహారావు, గత్తర జిలేడు పాఠశాల హెచ్ఎం మహాలక్ష్మిలను ఉపాధ్యాయులు దుశ్శాలువ కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు.ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ, అవార్డులు అందుకున్న ఉపాధ్యాయుల కృషి, సేవలకు దక్కిన గౌరవంగా ఈ సన్మానాన్ని పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం ఉపాధ్యాయులు చేస్తున్న సేవలను అభినందించారు.ఈ కార్యక్రమంలో అవార్డు గ్రహీతలతో పాటు క్లస్టర్ హెచ్ఎంలు, సెక్రటరీలు, హుసేన్ , చినబాబు, దేవదాస్, రామారావు,శేఖర్ గేన్నుబాబు, రామన్న,రాము శంకర్ రాజ్కుమార్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాలకు ఆన్లైన్ దరఖాస్తుల ఆహ్వానం

**చోడవరం (జయ జయహే)**




చోడవరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 2026--2027 సంవత్సరానికి క్రింద పేర్కొన్న ఏడు మద్యం దుకాణాలను నిర్వహించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చోడవరం ఎక్సైజ్ సీఐ కె.వి పాపనాయుడు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ చోడవరం మండలం -4 దుకాణాలు కె. కోటపాడు మండలం -2 దుకాణాలు,బుచ్చయ్యపేట మండలం -1 దుకాణం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ ఒకటో తేదీ అర్ధరాత్రి 12.00 గంటల వరకువెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్/ఆఫ్ లైన్ లో దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు.ఈ దుకాణాల నిర్వహణ కాలపరిమితి 01.10.2026 నుండి 30.09.2027 వరకు ఉంటుందన్నారు.దుకాణాల కేటాయింపు ప్రక్రియ వచ్చేనెల 5వ తేదీ ఉదయం 8 గంటల నుండి అనకాపల్లి గుండాల జంక్షన్, ఎస్.ఆర్. శంకరన్ మీటింగ్ కాంప్లెక్స్లో జిల్లా కలక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో ఏ 4 మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ నిర్వహిస్తామన్నారు.ప్రతి ఏ 4 మద్యం దుకాణానికి 4 దరఖాస్తులు వచ్చిన పక్షంలోనే సంబంధిత దుకాణానికి లాటరీ నిర్వహించబడుతుందనీ దరఖాసుదారులు గమనించాలన్నారు. దరఖాస్తుదారులు సంబంధిత నిబంధనలు, దరఖాస్తు రుసుము మరియు ఇతర వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించగలరన్నారు. లేదా ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్, చోడవరం స్టేషన్ లో సంప్రదించగలరన్నారు.

# వైభవంగా వైశాఖీ నృత్యోత్సవం-2026 ప్రారంభం





### తొలి రోజు మణిపురి, కథక్, భరతనాట్యం, యానిమల్ మాస్క్ నృత్య ప్రదర్శనలు

### దర్శనా ఝువేరికి 'భారత నృత్య భూషణస,హరి రెడ్డికి వైశాఖీ నేషనల్ అవార్డులు

**విశాఖపట్నం, సెప్టెంబరు 26:(జయ జయహే )**

నాట్యం నవరసావిష్కారం చేసింది. రసహృదయాలను ఆనంద డోలికలలో తేలియాడించింది. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడెమీ ఆధ్వర్యాన ప్రతిష్ఠాత్మక 'వైశాఖీ నృత్యోత్సవ్-2026' అఖిల భారత జాతీయ నృత్యోత్సవం కళా భారతి ఆడిటోరియంలో శనివారం సాయంత్రం అంగరంగవైభవంగా ప్రారంభమైంది. సంస్థ వ్యవస్థాపకుడు బిఆర్ విక్రమ్ కుమార్(గౌడ్) ఉత్సవ సంచాలకునిగా వ్యవహరించే ఈ రెండు రోజుల నృత్యోత్సవంలో తొలిరోజు మహారాష్ట్రకు చెందిన మణిపురి నాట్య నిపుణురాలు, పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనా ఝువేరి బృందం, కర్ణాటకకు చెందిన ప్రముఖ కథక్ నృత్యకారులు హరి రెడ్డి, ఒడిషా రాష్ట్రానికి చెందిన ధను బిసాయ్ సారథ్యంలో ప్రదర్శించిన యానిమల్ మాస్క్ డ్యాన్స్ చోటు చేసుకున్నాయి. తొలిరోజు ఉత్సవ ప్రదర్శనల్లో యానిమల్ డ్యాన్స్ ప్రత్యేకంగా అనిపించింది. మునుపెన్నడూ విశాఖలో ఈ తరహా నృత్య ప్రదర్శనలు జరిగిన ఆనవాళ్లు పెద్దగా లేవు. ప్రఖ్యాత మణిపురి నాట్యనిపుణురాలు మహారాష్ట్రకు చెందిన తన బృందం సభ్యులతో ప్రదర్శించిన మణిపురి నృత్యాంశాలు, వారి ప్రత్యేకమైన ఆహార్యం,కదలికలు, భంగిమలు రసానుభూతి పంచాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు, అతిథుల చేతులమీదుగా మహారాష్ట్రకు చెందిన ప్రఖ్యాత మణిపురి నాట్యకారిణి సంగీత నాటక అకాడెమీ అవార్డు గ్రహీత పద్మశ్రీ దర్శనా ఝువేరికి వైశాఖీ భారత నృత్య భూషణ-2026 పురస్కారం ఇచ్చి గౌరవించారు. కర్ణాటకకు చెందిన ప్రముఖ కథక్ నృత్యకారులు హరి రెడ్డి బృందం పూర్వరంగం అంశంతో ఉత్సవ ప్రదర్శనలకు శ్రీకారం చుట్టారు. గణేశవందనం,భావన తీన్ తాళ్, జుగల్బందీ, సగ్రామ్ అంశాలు దేనికదే ప్రత్యేకతను చాటుకున్నాయి. సర్గామ్, మధుర్ మాధవ్, తాండవ్ అంశాలు వీరి కథక్ నృత్య ప్రదర్శనలో చోటు చేసుకున్నాయి. హరి రెడ్డికి నిర్వాహకుల తరపున అతిథుల చేతులమీదుగా వైశాఖీ జాతీయ పురస్కారం అందజేశారు. ఒడిశాకు చెందిన యానిమల్ మాస్క్ డ్యాన్స్ బృందం అద్భుతమైన సమన్వయంతో ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలతో ప్రదర్శించిన తీరుప్రేక్షకుల హర్షధ్వానాలందుకుంది. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జాతీయ నృత్యం కూచిపూడి ప్రదర్శనల్లో నిష్ణాతులైన స్థానిక నాట్యాచార్యుల శిష్య బృందాలకు అవకాశం కల్పించడమే కాకుండా పెద్ద పీట వేయడం గమనార్హం. విశాఖపట్నానికి చెందిన ప్రణవం స్కూల్ ఆఫ్ డ్యాన్స్ నాట్యాచారులు బంగారయ్య, కలమశ్రీ బృందం-కూచిపూడి నాట్య ప్రదర్శన ఉంటుంది. అలాగే నంబాల జ్యోతి ఆధ్వర్యంలో నాట్యారాధన ఆర్ట్స్ అకాడెమీ-బృందం (కూచిపూడి), నాట్యం మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడెమీ వ్యవస్థాపక నాట్యాచార్యులు కరి వెంకట్ చిన్నారావు బృందం (భరతనాట్యం), శ్రీ సాయి లలిత కళా సమితి నాట్యాచార్యుడు వీవీఎస్ జగన్నాథ రావు బృందం(కూచిపూడి), నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడెమీ వ్యవస్థాపక నాట్యాచారిణి నాట్యశ్రీ కేవీ లక్ష్మి శిష్య బృందం, కూచిపూడి నాట్య ప్రదర్శనలు తొలిరోజు ప్రధానాంశాలకు ముందు ఏర్పాటు చేశారు. డాక్టర్ పేరాల బాల మురళీ కృష్ణ చక్కటి విశేషణాలు జోడించి ఆయా నృత్య ప్రదర్శనలకు అప్పటికప్పుడే ఇచ్చిన బహుభాషా కితాబులు అందరి హృదయాలను దోచుకున్నాయి. ముఖ్య అతిథిగా అడిషనల్ కమీషనర్ సీజీఎస్టీ ఎన్. మహ్మద్ అలీ, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి ఉషశ్రీ విశిష్ఠ అతిథిగా, రైటర్స్ అకాడెమీ ఛైర్మన్ వివి రమణ మూర్తి, గౌరవ అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక అతిథులుగా ఎమ్మెస్సెన్ రాజు, ఆచార్య వి బాల మోహన్ దాస్, కళాకృష్ణ, వసుంధరా దొరస్వామి, పద్మశ్రీ ఉమా మహేశ్వరి, అనుపమా మోహన్, నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఆకాడెమీ గౌరవ ఛైర్మన్ పూర్వపు ఆదాయపన్నుల శాఖ ఉన్నతాధికారి సూదగాని రవిశంకర్ నారాయణ్ ప్రారంభోపన్యాసం చేశారు. దంపతులు, దేశం నలు చెరగుల నుంచి హాజరైన జాతీయ నృత్యోత్సవాల సంచాలకులు జగబంధు జెనా, సాయి వెంకటేష్ తదితరులు జ్యోతి వెలిగించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు.

## వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలి

### వీఆర్ఏల నిరసనకు సీఐటీయూ సంఘీభావం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 26, జయ జయహే**




శ్రీకాళహస్తి: గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లకు (వీఆర్ఏ) ప్రభుత్వం వెంటనే పే స్కేల్ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య డిమాండ్ చేశారు. పే స్కేల్ అమలు చేయాలని కోరుతూ వీఆర్ఏలు వారం రోజులుగా శ్రీకాళహస్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపడుతున్న నిరసనకు శనివారం సీఐటీయూ సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా గురవయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం కింద రూ.26 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హత ఉన్న వీఆర్ఏలకు వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని, నామిని వీఆర్ఏలను క్రమబద్ధీకరించాలని కోరారు. వీఆర్ఏల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ప్రజా సంఘాలను కలుపుకుని ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గంధం మణి, వీఆర్ఏలు బాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యస్వామి కొండ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

### మాజీ ఎమ్మెల్యే బియ్యపు

**శ్రీకాళహస్తి (జయ జయహే )**



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన విజ్ఞానగిరి (కుమారస్వామి తిప్ప)పై జరుగుతున్న తవ్వకాలు, నిర్మాణాలపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన సంఘటనా స్థలాన్ని సందర్శించి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ, ఆలయానికి సంబంధించిన ప్రాంతంలో అనుమతులు లేకుండా తవ్వకాలు, నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఆలయ ఆస్తులను పరిరక్షించాల్సిన అధికారులు తక్షణమే స్పందించి సంబంధిత యంత్రాలను సీజ్ చేసి, నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే జిల్లా నాయకులతో కలిసి ధర్నా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఉత్తరాజీ శరవణకుమార్, కంఠా ఉదయ్‌కుమార్, మున్నా రాయల్, బుల్లెట్ జైశ్యామ్ రాయల్, శ్రీవారి సురేష్, తిరుమల చౌదరి, పీఎం చంద్ర, ముని కృష్ణారెడ్డి, సుమతమ్మ, కొట్టే శరవణ, జీవీకే రెడ్డి, గాదిపాకుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.




## స్థానిక ఎన్నికల్లో ముస్లింలకు ప్రాధాన్యత కల్పించాలి

### జేఏసీ ఛైర్మన్ ముర్తుజా

**తిరుపతి, సెప్టెంబర్ 26, జయ జయహే**

తిరుపతి స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ముస్లిం మైనార్టీలకు జనాభా ప్రాతిపదికన సముచిత ప్రాధాన్యత కల్పించాలని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఛైర్మన్ ముర్తుజా కోరారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరంలోని 66 డివిజన్లలో జనాభా దామాషా ప్రకారం ముస్లింలకు ఆరు డివిజన్లు కేటాయించాలని కోరారు. మైనార్టీ ఓట్లు అధికంగా ఉన్న డివిజన్లలో ముస్లిం అభ్యర్థులకు అవకాశం కల్పించాలని, ప్రతి రాజకీయ పార్టీ న్యాయమైన వాటాను ప్రకటించాలని అన్నారు. ప్రధాన పార్టీలు ముస్లింలకు తగిన ప్రాతినిధ్యం కల్పించకపోతే స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తామని ముర్తుజా స్పష్టం చేశారు. సమావేశంలో జేఏసీ నాయకులు కలిముల్లా, ఫయిజుల్లా, అమీర్ భాష, సాధిక్, మూనీవర్, మెకానిక్ బాబు పాల్గొన్నారు.




## దళితుల మరణ కాండ పోస్టర్ విడుదల

**అరకులోయ: సెప్టెంబర్ 26. జయ జయహే.**

బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బందేల గౌతమ్ కుమార్ ఆదేశాల మేరకు, రాష్ట్రంలో 27 మంది దళితుల మరణాలపై న్యాయం కోసం బి.ఎస్.పి పార్టీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ల వద్ద నిరసన సభ లు సెప్టెంబర్ 28 వ తేదీ సోమవారం నిర్వహిస్తున్నట్లు, అల్లూరి జిల్లా బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో అరకు వేలి మండలం గిరిజన భవనంలో పోస్టర్ ను ఆవిష్కరణ చేశారు, ఈ కార్యక్రమంలో పాడేరు అసెంబ్లీ కార్యదర్శి పోతురాజు, అరకు వేలి మండల అధ్యక్షులు ప్రియాంక రాజ్ పాల్గొన్నారు,

# ప్రతి ఒక్కరూ పర్యావరణ హిత జీవన విధానం అలవర్చుకోవాలి

### - మన పరిసరాలు మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### - మనం తినే పండ్లతో సామాజిక వనాలు పెంచాలి: జెవి రత్నం

**గాజువాక (జయ జయహే)**





పర్యావరణ హిత జీవన విధానం అలవర్చుకోవాలి అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. శనివారం మధ్యాహ్నం గాజువాకలో సిద్దార్థ పబ్లిక్ స్కూల్లో ప్రకృతి రైతు జమీల్ మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో రత్నం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గాలిని శుద్ధి చేసే మొక్కలు ఇంట్లో పెంచాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ మానవాళి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు తమ పరిసరాలు తామే పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని వివరించారు. మనం తినే పండ్లతో సామాజిక వనాలు పెంచాలి అని పిలుపునిచ్చారు. ప్రస్తుతం శీతోష్ణస్థితి మార్పు వల్ల ఏర్పడిన ఎల్ నినో ,సూపర్ ఎల్ నినొ ల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ శీతోష్ణస్థితిని చల్ల బరిచేందుకు కృషి చేయాలని కోరారు. శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేయకపోతే ఏర్పడే పరిస్థితులు వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి కుసుమ మాట్లాడుతూ తమ విద్యార్థులందరికీ పర్యావరణ హితంగా జీవించడం మీద శిక్షణ ఇస్తున్నామన్నారు. మనం మన భవిష్యత్తు తరాలు జీవించాలంటే పర్యావరణ హితంగానే జీవించాలన్నారు. ఉపాధ్యాయురాలు రెహనా మాట్లాడుతూ మనం మన ఇళ్ళ వలె మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె కోరారు. పర్యావరణ పరిరక్షణ అంటే మనం సమస్త జీవుల్లో ఒక భాగమే అని గుర్తించి అన్ని జీవుల్ని కాపాడుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెహమున్నీసా, పలువురు విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ కోసం మాట్లాడారు.



## ఘనంగా అన్న సమారాధన

**కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 27,**

కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం గ్రామంలో వినాయక గుడి వద్ద అన్న సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 1000 మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం సాయంత్రం ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.




## గ్రంథాలయాలకు పోటీ పరీక్షల పుస్తకాలు పంపిణీ

**అచ్యుతాపురం, సెప్టెంబర్ 26, జయ జయహే:**

అచ్యుతాపురం శాఖా గ్రంథాలయం సందర్శనలో భాగంగా పలు విభాగాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిన గ్రంథాలయల శాఖ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ . ఈ సందర్భంగా మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ఇటీవల ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయాలలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ విద్యార్థిని విద్యార్థుల కోరిక మేరకు 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఆరు లక్షల రూపాయలు విలువ గల పోటీ పరీక్షల పుస్తకాలును కొనుగోలు చేసారు . అందరికీ ఉద్యోగ భృతి కల్పించి నిరుద్యోగ కుటుంబాలకు భరోసాగా నిలవాలని ఉద్దేశంతో ప్రభుత్వ ఉద్యోగాలు కోసం కూటమి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసినట్లు చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ స్పష్టం చేశారు. జాబ్ క్యాలెండర్ నేపథ్యంలో సరఫరా చేసిన పుస్తకాలు వెంటనే పాఠకులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ పుస్తకాలును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని యువత ఉన్నత భవిష్యత్ కుతోడ్పాటునందించాలని కోరారు. మన ఊరు మన గ్రంథాలయం పేరుతో గ్రంథాలయాలకు పూర్వ వైభవం అందించే విధముగా వైఫై ఏర్పాటుకు, ఎన్సిఆర్టి పుస్తకాలు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. గ్రంథాలయం ఉపయోగించుకుంటున్న విద్యార్థులు తమ బాధ్యతగా గ్రంథాలయ ఆవరణ పరిశుభ్రంగా చూసుకోవాలన్నారు. దాతలు సహకారం ముఖ్యమని తెలిపారు. అచ్యుత విద్యా సంస్థల అధినేత శేషగిరి రావు, ఉపాధ్యాయులు నాగేశ్వరరావులు మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో గ్రంథాలయాల ప్రాముఖ్యత, చరిత్ర కలిగి ఎంతో మంది విద్యార్థులు స్థిర పడ్డారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రీ కుమార్ రాజు, స్థానిక లైబ్రేరియన్ ఎల్ వి రమణ, ఎలమంచిలి లైబ్రేరియన్ వి.ఆనంద్, అడివివరం లైబ్రేరియన్ ఎన్ వి నరసింహం, పరవాడ గ్రంథపాలకుడు కె వి లక్ష్మణ రావు విద్యార్థులు పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనడానికి అనుమతి లేదు

**అనకాపల్లి జయ జయహే**




అనకాపల్లి జిల్లాలో పనిచేస్తున్న స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు ఉద్యోగస్తులు సెప్టెంబర్ 27న తలపెట్టిన తమ డిమాండ్ల సాధన కోసం నిర్వహించిన చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనడానికి అనుమతి లేదని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్పష్టం చేశారు రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు వరదల పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రజల భద్రత సహాయక చర్యలు పునరావాస కార్యక్రమాలు మరి అత్యవసర సేవలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని శాఖల అధికారులు సిబ్బంది తమ తమ విధులు నిర్వహించే ప్రదేశాల్లో అందుబాటులో ఉండి వర్షాలు మరియు వరదల కారణంగా ఏర్పడే అత్యవసర పరిస్థితుల నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు ఈ నేపథ్యంలో అనకాపల్లి జిల్లా చెందిన స్వర్ణ వార్డు ఉద్యోగస్తుల విధులకు గైజ హాజరు చాలా విజయవాడ కార్యక్రమానికి వెళ్లడానికి అనుమతి లేదని స్వర్ణ అవార్డు ఉద్యోగులు తమకు కేటాయించిన విధుల్లో తప్పనిసరిగా హాజరై స్థానిక ప్రజలకు అవసరమైన రెవెన్యూ సేవలు విపత్తు నిర్వహణ చర్యలు ప్రభుత్వ ఆదేశాలు అమలుకు సహకరించాలని ముందస్తు అనుమతి లేకుండా వీధిలోకు గైర్హాజరు కార్యక్రమానికి హాజరైన వారికి చట్ట ప్రకారం కఠిన చర్యలు చేపడతామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు అదేవిధంగా ప్రభుత్వం సర్వీస్ నియామకాలకు అనుగుణంగా కఠినమైన శాఖా పరంగా చర్యలు కూడా తీసుకోబడతాయని జిల్లాలో ప్రతి బస్టాండ్ వద్ద రైల్వే స్టేషన్ వద్ద పోలీసు సిబ్బందిని నియమించ చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన హెచ్చరించారు అందువల్ల జిల్లాలోని స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు ఉద్యోగస్తులు ప్రస్తుత విపత్తుల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని తమ విధులకు హాజరై ప్రజలకు అవసరమైన సేవలు అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు

# రక్తపాతంతో ముగిసిన రాత్రి

## ఏడుగంటల భయం... ఐదు ప్రాణాల బలి.. ఆజమ్‌గఢ్‌ను దిగ్భ్రాంతికి గురిచేసిన రక్తపాతం

(హెచ్.ప్రతాప్)



ప్రశాంతంగా సాగాల్సిన ఒక పూజా కార్యక్రమం క్షణాల్లో రక్తపాతానికి దారి తీసి, చివరకు ఏడుగంటల ఉత్కంఠభరిత బందీ నాటకం, ఐదుగురి మరణాలతో ముగియడం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఉత్తరప్రదేశ్‌లోని అజంగఢ్ జిల్లా శంభుపూర్ గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన మానవ సంబంధాల సంక్షోభం, అదుపు కోల్పోయిన ఆవేశం ఎంతటి విషాదాలకు కారణమవుతాయో మరోసారి చాటిచెప్పింది.

మంగళవారం సాయంత్రం గ్రామంలోని ఒక ఇంట్లో ఆధ్యాత్మిక కార్యక్రమం జరుగుతోంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సాధారణంగా భావించిన ఆ పూజ క్రమంగా ఉద్రిక్తతకు దారి తీసింది. ఇంటి యజమాని అరవింద్ సింగ్‌కు పూజ నిర్వహణపై తీవ్ర అభ్యంతరాలు ఉన్నట్లు తెలిసింది. కొద్దిసేపట్లోనే వాగ్వాదం తీవ్ర స్థాయికి చేరుకోగా, అతడు తన వద్ద ఉన్న రివాల్వర్‌తో విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఆ దారుణ ఘటనలో అతని భార్య బబితా, పూజ నిర్వహిస్తున్న ఇద్దరు పురోహితులు మహేంద్ర పాఠక్, అఖిలేష్ మిశ్రా అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో అక్కడ ఉన్న మరో ఇద్దరు పూజారులు అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డారు.

ట్రిపుల్ హత్య తర్వాత పరిస్థితి మరింత భయానకంగా మారింది. అరవింద్ తన ముగ్గురు చిన్నారులను ఇంట్లోని ఒక గదిలో బందీలుగా ఉంచి తలుపులు మూసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు భారీ బందోబస్తుతో సంఘటనా స్థలానికి చేరుకుని ఇంటిని చుట్టుముట్టారు. చిన్నారుల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా జాగ్రత్తపడుతూ, అతడిని లొంగిపోవాలని పలుమార్లు విజ్ఞప్తి చేశారు. కుటుంబ సభ్యులను, బంధువులను కూడా చర్చల్లో భాగస్వాములను చేశారు. అయితే అరవింద్ ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. బయట పోలీసులు, లోపల ఆయుధంతో ఉన్న వ్యక్తి, మధ్యలో అమాయక చిన్నారులు... గ్రామమంతా ఆందోళనలో మునిగిపోయింది.




గంటలు గడుస్తున్న కొద్దీ ఉత్కంఠ మరింత పెరిగింది. అర్ధరాత్రి తర్వాత ఒక్కసారిగా ఇంటి లోపల నుంచి తుపాకీ పేలిన శబ్దం వినిపించింది. వెంటనే చిన్నారుల కేకలు బయట ఉన్న పోలీసులను కలవరపరిచాయి. పరిస్థితి చేయిదాటుతోందని భావించిన ప్రత్యేక బృందాలు స్టన్ గ్రెనేడ్లు, టియర్ గ్యాస్ సహాయంతో తలుపులు బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించాయి. అయితే గదిలోకి అడుగుపెట్టిన పోలీసులపై కూడా అరవింద్ కాల్పులు జరిపినట్లు అధికారులు తెలిపారు. దీనితో చోటుచేసుకున్న ఎదురుకాల్పుల్లో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటికే అతని కుమారుడు కూడా గాయపడి ఉన్నాడు. పోలీసులు ఇద్దరు కుమార్తెలను సురక్షితంగా రక్షించారు. కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన కుమారుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు

ఈ ఘటన అనంతరం పోలీసులు విస్తృత స్థాయిలో దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని, హత్యలకు ఉపయోగించిన లైసెన్సు రివాల్వర్‌తో పాటు ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. ఘటనకు దారితీసిన కుటుంబ విభేదాలు, పూజా కార్యక్రమంపై నిందితుడి అభ్యంతరాలు, అతని మానసిక పరిస్థితి, అలాగే కాల్పులకు ముందు జరిగిన పరిణామాలపై విచారణ కొనసాగిస్తున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి, ఫోరెన్సిక్ బృందాలు సేకరించిన శాస్త్రీయ ఆధారాలను పరిశీలిస్తున్నారు. బందీ నాటకం నుంచి సురక్షితంగా బయటపడిన ఇద్దరు చిన్నారులను వైద్య పరీక్షల అనంతరం బంధువుల సంరక్షణకు అప్పగించారు. ఈ విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన భార్య, ఇద్దరు పురోహితులు మరియు చిన్నారి బాలుడి మరణాలపై వేర్వేరు కోణాల్లో కేసులు నమోదు చేసిన పోలీసులు, ఘటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తూ సమగ్ర నివేదికను సిద్ధం చేస్తున్నారు. అంతేకాక, గ్రామంలో ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా అదనపు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

ఒక కుటుంబ విభేదంతో ప్రారంభమైన ఈ ఘటన చివరకు భార్య, ఇద్దరు పురోహితులు, చిన్నారి కుమారుడు మరియు స్వయంగా నిందితుడి మరణంతో ముగిసింది. శంభుపూర్ గ్రామాన్ని ఒక్కరాత్రిలోనే విషాద ఛాయలు కమ్ముకున్నాయి. ఇటీవల కాలంలో ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకున్న అత్యంత దిగ్భ్రాంతికర సంఘటనలలో ఇది ఒకటిగా నిలిచింది. కుటుంబ కలహాలు, మానసిక ఒత్తిళ్లు, నియంత్రణ కోల్పోయిన ఆవేశం ఎంతటి అపూరణీయ నష్టాన్ని మిగులుస్తాయో ఆజమ్‌గఢ్ ఘటన ఒక విషాద హెచ్చరికగా మిగిలిపోతుంది

# ఏఐకి అడ్డుకట్ట కాదు.. బాధ్యత కావాలి

(సి.హెచ్. ప్రతాప్)




కృత్రిమ మేధ ఇప్పుడు ప్రయోగశాలల గోడల మధ్య ఉండే సాంకేతికత కాదు. మన చేతిలోని మొబైల్ నుంచి కార్యాలయ నిర్ణయాల వరకు, విద్య నుంచి వైద్యం వరకు, వ్యాపారం నుంచి వినోదం వరకు దాని ప్రభావం వేగంగా విస్తరిస్తోంది. ఈ వేగం ఆశ్చర్యపరుస్తున్నా, అదే సమయంలో ఒక కీలక ప్రశ్నను ముందుకు తెస్తోంది---ఏఐ ఎంత వరకు స్వేచ్ఛగా సాగాలి? దానికి నియంత్రణ అవసరమా? అవసరమైతే అది ఆవిష్కరణను అడ్డుకోకుండా ఎలా ఉండాలి?

ఏఐ అందిస్తున్న అవకాశాలను తక్కువగా అంచనా వేయలేం. వైద్య నిర్ధారణలో వేగం, పరిశ్రమల్లో ఉత్పాదకత, విద్యార్థులకు వ్యక్తిగత అభ్యాసం, వ్యవసాయంలో డేటా ఆధారిత సలహాలు, చిన్న వ్యాపారాలకు తక్కువ ఖర్చుతో సాంకేతిక సహాయం---ఇలా అనేక రంగాల్లో అది కొత్త దారులు తెరుస్తోంది. భారత్ వంటి యువ జనాభా అధికంగా ఉన్న దేశానికి ఇది ఉపాధి, ఆవిష్కరణ, ఆర్థిక వృద్ధికి పెద్ద అవకాశంగా మారవచ్చు.

కానీ ప్రయోజనాల వెనుక ప్రమాదాలూ అంతే వేగంగా పెరుగుతున్నాయి. ఒక వ్యక్తి ఎప్పుడూ చెప్పని మాటలను అతని స్వరంలో వినిపించవచ్చు. ఎప్పుడూ జరగని ఘటనను వీడియోగా చూపించవచ్చు. డీప్‌ఫేక్‌లు, నకిలీ ఆడియోలు, మోసపూరిత ప్రకటనలు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం---ఇవి ఇక ఊహలు కావు. ఒక తప్పుడు వీడియో వ్యక్తి ప్రతిష్ఠను దెబ్బతీయగలదు. ఒక నకిలీ సందేశం ఆర్థిక నష్టానికి దారి తీస్తుంది. ఒక కల్పిత దృశ్యం సామాజిక ఉద్రిక్తతకు కూడా కారణమవుతుంది.

ఉద్యోగ రంగంలోనూ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. కొన్ని పునరావృత పనులను యంత్రాలు చేపడుతున్నాయి. మరికొన్ని ఉద్యోగాల్లో మానవ నైపుణ్యాలకు కొత్త సాంకేతిక పరిజ్ఞానం తోడవుతోంది. అందువల్ల ఏఐని అడ్డుకోవడం సమాధానం కాదు. విద్యా వ్యవస్థను మార్చడం, యువతకు కొత్త నైపుణ్యాలు నేర్పడం, ఉద్యోగులకు పునఃశిక్షణ ఇవ్వడం మరింత ముఖ్యం.

భారత్‌కు కావలసింది కఠినంగా తలుపులు మూసే విధానం కాదు; బాధ్యతతో తలుపులు తెరిచే వ్యవస్థ. డీప్‌ఫేక్‌లకు స్పష్టమైన గుర్తింపు, వ్యక్తిగత డేటాకు గట్టి రక్షణ, పిల్లల కోసం ప్రత్యేక భద్రతా నిబంధనలు, మోసపూరిత కంటెంట్‌పై వేగవంతమైన చర్య, కీలక నిర్ణయాల్లో యంత్రాలపై మానవ పర్యవేక్షణ అవసరం. అదే సమయంలో పరిశోధన, స్టార్టప్‌లు, దేశీయ సాంకేతిక ఆవిష్కరణలకు స్వేచ్ఛ కొనసాగాలి. సాంకేతికతకు వేగం అవసరం. సమాజానికి భద్రత అవసరం. ఈ రెండింటిలో ఏదో ఒకదాన్ని ఎంచుకోవాల్సిన పరిస్థితి రావాల్సిన అవసరం లేదు. ఏఐ మనిషిని మించిపోవడమే అసలు భయం కాదు; మనిషి బాధ్యతను మరిచిపోయేంతగా దానిపై ఆధారపడటమే పెద్ద ప్రమాదం. సాంకేతికత చేతిలో ఉండాలి---మనిషి సాంకేతికత చేతిలో పడకూడదు.

# విధుల్లోకి 138 మంది కొత్త పోలీస్ కానిస్టేబుళ్లు

## రాజమహేంద్రవరం 4వ ఐ.ఆర్. బెటాలియన్‌లో ఘనంగా పాసింగ్ అవుట్ పరేడ్

రాజమహేంద్రవరం:జయ జాయిహే : సెప్టెంబర్26:





4వ ఐ.ఆర్.బెటాలియన్ సెంటర్‌లో 2025--26 బ్యాచ్‌కు చెందిన 138 మంది లు ఎపిఎస్పీ శిక్షణనువిజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా పాసింగ్ అవుట్ పరేడ్‌ను ఘనంగానిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల లక్ష్మీ దుర్గేష్ ప్రసాద్, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.మంత్రి కందుల లక్ష్మీ దుర్గేష్ ప్రసాద్‌కు 4వ ఐ.ఆర్. బెటాలియన్ కమాండెంట్ పి. సత్తిబాబు ఆధ్వర్యంలో అధికారులుపుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న ట్రైనీ పోలీసుల గౌరవ వందనాన్ని మంత్రి స్వీకరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో, డిజిపి హరీష్ కుమార్ గుప్తా సారథ్యంలో రాష్ట్ర పోలీస్ శాఖ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తోందన్నారు. నూతన కానిస్టేబుళ్లు బాధ్యత, అంకితభావం, క్రమశిక్షణ, నిజాయితీతో విధులు నిర్వహించాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న పోలీసులకు, వారి తల్లిదండ్రులకఅభినందనలు తెలిపారు.శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారికి మంత్రి చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. బెస్ట్ ఇండోర్‌గా బి. నవీన్ (1వ బెటాలియన్), బెస్ట్ అవుట్‌డోర్‌గా ఏ. రాము నాయుడు (1వబెటాలియన్), బెస్ట్ ఫైరర్‌గా ఎల్. శ్రీను (1వ బెటాలియన్), బెస్ట్ ఆల్‌రౌండర్‌గా వి. నవీన్ (4వ బెటాలియన్) ఎంపికయ్యారు.కార్యక్రమంలో 4వ ఐ.ఆర్. బెటాలియన్ కమాండెంట్ పి. సత్తిబాబు, అదనపు ఎస్పీ (అడ్మిన్) పాటిల్ దేవరాజ్ మనీష్, , సౌత్ జోన్ డీఎస్పీ ఎ . శివప్రియ, అసిస్టెంట్ కమాండెంట్లు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్‌సిటిపిసిలు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




# ఎన్నికల సన్నద్ధత, నేర నియంత్రణ గంజాయి నిర్మూలనపై దృష్టి పెట్టాలి

## ఆరు జిల్లాల ఎస్పీలతో ఐజీపీ సమీక్ష

### విశాఖపట్నం రేంజ్ ఐజీపీ గోపినాథ్ జట్టి

విశాఖపట్నం జయజయహే

విశాఖపట్నం రేంజ్ ఐజీపీ గోపినాథ్ జట్టి ఆరు జిల్లాల ఎస్పీలతో జూమ్ ద్వారా సమగ్ర సమీక్ష నిర్వహించారు. ాూాూ×ూ, మహిళలు--బాలల భద్రత, రోడ్డు భద్రత, చీణూా, పెండింగ్ కేసులు, సైబర్ క్రైమ్, స్మార్ట్ పోలిసింగ్ , స్థానిక సంస్థల ఎన్నికల భద్రతపై సమీక్షించారు. పోక్సో , మహిళలపై నేరాల కేసుల దర్యాప్తును వేగవంతం చేసి అమలు చేయాలని ఆదేశించారు. గంజాయి, మాదకద్రవ్యాల సరఫరా నెట్‌వర్క్‌పై నిఘా పెంచి, చీణూా చర్యలు, పెండింగ్ చీదీఔం అమలును వేగవంతం చేయాలని సూచించారు. ప్రమాదాల బ్లాక్ స్పాట్లను గుర్తించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, సైబర్ కేసుల్లో ఫ్రీజ్ అయిన నగదును బాధితులకు త్వరగా అందేలా చూడాలని తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలు, సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక భద్రతా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. హిస్టరీ, రౌడీ షీటర్లు, సమస్యాత్మక వ్యక్తులపై నిఘా కొనసాగించాలని, పెండింగ్ చీదీఔంను త్వరగా అమలు చేయాలని సూచించారు. ఎన్నికల భద్రతా ఏర్పాట్లను ఎస్పీలు స్వయంగా పర్యవేక్షించాలని ఐజీపీ ఆదేశించారు. విశాఖపట్నం రేంజ్ పరిధిలోని అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ పోలవరం జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా విజయనగరం జిల్లా ఎస్పీ ూ.=. దామోదర్ పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి శ్రీకాకుళం జిల్లా ఎస్పీ ఖ.ఎ. మహేశ్వర్ రెడ్డి లతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆరు జిల్లాల ఎస్పీలు జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.



# ఆర్కేకు చందన నాగేశ్వర్ చేయూత

## అనారోగ్యంతో ఉన్న సీనియర్ పాత్రికేయుడికి రూ.10 వేల ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం: జయ జయహే : సెప్టెంబర్ 26:

ధవళేశ్వరం ఎర్రకొండ ప్రాంతానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు రామకృష్ణ (ఆర్కే)ను మాజీ రాష్ట్ర పచ్చదనం మరియు సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్మన్, గోపాలపురం వైఎస్సార్‌సిపి రాష్ట్ర కార్యదర్శి(పార్లమెంట్) చందన నాగేశ్వర్ పరామర్శించారు.ఇటీవల తీవ్రఅనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన రామకృష్ణ ప్రస్తుతం డిశ్చార్జ్ అయి స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. అనారోగ్యం కారణంగా విధులకు వెళ్లలేకపోవడంతో ఆయన కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం స్థానిక వైఎస్సార్‌సిపి నాయకుల ద్వారా తెలుసుకున్న చందన నాగేశ్వర్ స్వయంగా రామకృష్ణ నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10,000 ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. రామకృష్ణ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిన వెంటనే స్పందించి, ఆయన కుటుంబానికి తన వంతు సహాయం అందించినట్లు తెలిపారు. రామకృష్ణ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి తన వృత్తిలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సిపి నాయకులు తలారి ప్రసాద్, షట్టర్ భాష, మెండా రాజేష్, గున్న సత్తిబాబు, బోడెట్టి శివాజీ, మస్తాన్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 28న వైఎస్సార్సీపీ ఐడీ కార్డుల పంపిణీ

## పాడేరు ఎమ్మెల్యే రాక..

కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 27,



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ బలోపేతమే లక్ష్యంగా కొయ్యూరు మండల కేంద్రంలోని గిరిజన భవనం వద్ద ఈ నెల 28న (సోమవారం) ఉదయం 11:00 గంటలకు వైఎస్సార్సీపీ ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరగనుంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాడేరు శాసనసభ్యులు, అల్లూరి జిల్లా పార్టీ ఇన్‌ఛార్జ్ మత్స్యరాస విశ్వేశ్వర రాజు హాజరై పార్టీ శ్రేణులకు ఐడీ కార్డులను అందజేయనున్నారు.ఈ కార్యక్రమానికి కొయ్యూరు మండల పార్టీ అధ్యక్షులు బిడిజన అప్పారావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని 33 పంచాయతీల నుండి రాష్ట్ర, జిల్లా, మండల, మహిళా విభాగం నాయకులు, మాజీ ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ వాలంటీర్లు, గృహ సారథులు, అన్ని అనుబంధ విభాగాల సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, జగనన్న అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1,
BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com